ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
సెప్టెంబరు 03, 2017

ENTERED
C KSR02B 183

# చిత్రం భళారే ఈ చిత్రం

# సినీ గురువులు



తెలుగు సినీ పరిశ్రమలో మంచి నటులే కాదు మంచి గురువులూ వున్నారు. యాక్టింగ్‌లో నిలదొక్కుకునేందుకు కొత్త వారికి మంచి మార్గదర్శకులనిపించుకున్న వీళ్ళంతా ఒకప్పుడు టీచర్లుగా కొనసాగినవారే. ప్రస్తుతం తెలుగు చిత్రసీమలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఒకప్పటి ఆ ఉపాధ్యాయులెవరో మీరూ తెలుసుకోండి.

'నాన్నకు ప్రేమతో', 'కుమారి 21ఎఫ్' 'నేనొక్కడినే', '100 పర్సెంట్ లవ్' లాంటి హిట్ చిత్రాలని అందించిన దర్శకుడు సుకుమార్. వి.వి.వినాయక్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా సుకుమార్ సినీ అరంగేట్రం గురించి చాలామందికి తెలుసు. అయితే రాజోలులో పుట్టి పెరిగిన సుకుమార్‌కు గణితంలో పట్టావుంది. తర్వాత కాకినాడలోని ఓ ప్రముఖ డిగ్రీ కాలేజ్‌లో (మ్యాథ్స్, ఫిజిక్స్) లెక్చరర్‌గా కెరీర్‌ని ప్రారంభించాడు సుకుమార్. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో పిజి చేసి ఆ తర్వాత స్కూల్ టీచర్‌గా పనిచేసి బెస్ట్ టీచర్ అనిపించుకున్నాడట త్రివిక్రమ్. ఆ తర్వాత చియన్ విక్రమ్ సినిమాకి మాటల రచయితగా సినీ పరిశ్రమలో అడుగుపెట్టాడు. 'చిరునవ్వుతో', 'నువ్వే నువ్వే', 'మల్లీశ్వరి', 'అత్తారింటికి దారేది' చిత్రాల ద్వారా స్టార్‌డమ్‌ని దక్కించుకున్నాడు. 1987 నుండి ఇప్పటి దాకా తెలుగు చిత్రాల్లో కామెడీకి కేరాఫ్ బ్రహ్మానందం అనే చెప్పాలి. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకోవడంతోపాటు పద్మ శ్రీ అవార్డుని అందుకున్న బ్రహ్మానందం మంచి నటుడుగానేకాదు అత్తిలిలో ఒక కాలేజీలో తెలుగు లెక్చెరర్‌గా పనిచేసి మంచి టీచర్‌గా కితాబు అందుకున్నాడు. హాస్యనటుల్లో బ్రహ్మానందం తర్వాత మనకి గుర్తొచ్చే పేరు ఎమ్మెస్ నారాయణ. రచయితగా సిని పరిశ్రమలో అడుగు పెట్టిన ఎమ్మెస్ తొలి వృత్తి ఉపాధ్యాయుడుగానే. వీళ్ళే కాదు ఒకప్పటి సినీ దిగ్గజాలు... నటుడు రాజబాబు, పాటల రచయిత సినారే, మాటల రచయిత పరుచూరి గోపాలకృష్ణ ఉపాధ్యాయులుగా పనిచేసిన వారే... ఇక తారల విషయానికొస్తే నటి దేవయాని ఇప్పుడు పూర్తిగా టీచింగ్ వృత్తిలోనే కొనసాగుతోంది.

ENTERED KSR02B1F3




అదో ఏటవాలు కొండ. దాన్ని ఆనుకుని ఇటుకలు పేర్చినట్టుండే నివాసాలు. ఆ మట్టి ఇళ్లను కొండ రాయికి ఎలా అతికించారో..! అని సంభ్రమంలో పడి అలా చూస్తుండి పోవాల్సిందే. ఆఫ్రికాలోని మాలి డాగోన్ గ్రామాన్ని చూస్తే వేరే ప్రపంచంలోకి రాలేదు కదా! అనిపిస్తుంది. తేనె తుట్టెలు ఎలా కొండ వాలున ఉంటాయో అలా ఈ మట్టి ఇళ్లు దూరం నుంచి కనిపిస్తాయి. డాగోన్‌ల విలక్షణమైన ఆ గ్రామం పేరు 'క్లిఫ్ ఆఫ్ బాండియాగారా'. కొండ చరియను ఆనుకుని ఉండే ఈ ప్రత్యేక గ్రామం ప్రపంచ వారసత్వ సంపద కూడా.

# డాగోన్‌ల రహస్య గ్రామం

సహేల్ భూముల్లో 100 మైళ్ల పొడవునుండే బాండియాగారా సానువులు డాగోన్‌ల మర్మ దేశం. 1500 అడుగుల ఎత్తునుండే పర్వతాలను వేరు చేసే ఈ సానువుల్లో నక్కిన బాండియాగారా కొండలపైకి వేలాది ఏళ్ల క్రితమే జనావాసాలు వచ్చాయి. కానీ, ఎవరూ కూడా పర్వత లోయలో నివసించే సాహసం చేయలేదు. 15వ శతాబ్దంలో ఆ ప్రాంతానికి వచ్చిన డాగోన్ తెగవాళ్లు అక్కడ తొలి ఇంటిని కట్టారు. దీర్ఘ చతురస్రాకారంలో ఉండే ఈ ఇళ్ల పైకప్పులు టోపీ పెట్టినట్టు ఉంటుంది. రాతిని తొలచి పునాది ఏర్పాటు చేసి దాని మీద అంచెలు అంచెలుగా గ్రామాన్ని నిలబెట్టారు. అంతకు ముందటి టెల్లెమ్ తెగవారు ఈ మట్టి ఇళ్లను కట్టే పద్ధతిని డాగోన్‌లకు నేర్పారు. టెల్లెమ్‌లు ఇక్కడ నివసించకపోయినా వారి బంధువుల మృతదేహాలను ఈ తరహా కట్టడాల్లో సమాధి చేసేవారు. వరదల బీభత్సం ఎక్కువగా ఉండే ప్రాంతంలో పర్వత చరియ మీదే వారి పూర్వీకుల మృతదేహాలు సురక్షితంగా ఉంటాయని అలా చేసేవారు. కానీ డాగోమ్‌లు వీటిని పూర్తిగా నివాసాలకు ఉపయోగించడం మొదలెట్టారు. కుటుంబ అవసరాలకు తగ్గట్టు వాటిని మలిచారు. ఇప్పటికీ ఈ చరియల్లోని మట్టి కట్టడాల్లో టెల్లెమ్‌ల అస్థిపంజరాలు, ఎముకలు కనిపిస్తాయి. ఇసుకరాతి పర్వతం మీద నక్కి ఉండే ఈ గ్రామం కొత్తవారికి ఇట్టే తెలిసేది కాదు. దాన్ని చేరుకోవడం కూడా కష్టమయ్యేది. ఇదో రకంగా ఊరికి రక్షణనిచ్చింది. డాగోమ్‌లు అందుకే అన్ని తరాలపాటు ఇక్కడ నుంచి కదల్లేదు. ఆహారాన్ని దాచుకునేందుకు, వంట సరకు దాచుకునేందుకు ఇలా ప్రతి అవసరానికి ఓ మట్టి ముద్ద కట్టడమయ్యేది. 700 ఏళ్ల క్రితం టెల్లెమ్‌లను తరిమేశాక డాగోన్‌లు ఈ ప్రాంతాన్ని తమ సొంతం చేసుకున్నారు. ఎడారి ప్రాంతం కావడంతో వీరికి నీడనిచ్చే చోటుగా ఇదొక్కటే కనబడింది. అంతెత్తు పర్వతం అడ్డు నిలిస్తే.. దాని చరియల కింద గూడు కట్టుకుని ఉండే డాగోన్‌లను చూస్తే.. పక్షుల గూళ్లు గుర్తుకు వస్తాయి. దగ్గరలోని హంబోరీ గ్రామం పసుపు పచ్చటి మైదానంలో విసిరేసినట్టు దూరంగా కనిపిస్తుంటుంది. దీని వల్లే మిగతా ప్రపంచానికి డాగోన్‌ల గురించి 1930ల వరకు తెలియలేదు. మూడేళ్లపాటు పశ్చిమ ఆఫ్రికాను జల్లెడపట్టిన ఫ్రెంచ్ శాస్త్రవేత్త మార్సెల్ గ్రియాలెకు ఈ గ్రామం అంతుచిక్కింది. తొలిసారి ఈ గ్రామాన్ని చూసిన గ్రియాలె హతాశుడయ్యాడు. ఆ తర్వాత గ్రామంలో ప్రవేశించడానికి చాలా ప్రయత్నాలు చేశాడు. అతడిని ఆ గ్రామంలోకి ప్రవేశించడానికి డాగోన్‌లు ఇష్టపడలేదు. తమ పూర్వీకులు బలవంతపు మత మార్పిడులను తప్పించుకుని ఇక్కడ తలదాచుకున్నారనే విషయం వాళ్లకు తెలుసు. ఆ తర్వాత తమ సంస్కృతిని నిలబెట్టుకోవడం కోసం ఎన్ని త్యాగాలు చేశారో కూడా తెలుసు. అందుకే మార్సెల్‌ను వాళ్లు నమ్మలేదు. చివరకు ఏళ్ల వ్యవధిలో 7 సార్లు గ్రామంలో కలియతిరిగి ఓ అంధ డాగోన్ నుంచి ఆ గ్రామం కథ తెలుసుకున్నాడు మార్సెల్. ఒగొటెమ్మెలి అనే ఆ పెద్దాయనతో 1946లో ఇంటర్వ్యూలు తీసుకుని ఆ తర్వాత 'కాన్వర్షేషన్స్ విత్ ఒగొటెమ్మెలి' పేరిట ఓ పుస్తకం ప్రచురించాడు. అప్పుడే ఆ గ్రామం కథ ప్రపంచానికి తెలిసింది. మిగతా ప్రపంచంతో సంబంధం లేకుండా బతుకుతున్న డాగోన్‌ల జీవన శైలి కన్నా వారి ఇళ్ల నిర్మాణమే అందర్నీ ఆశ్చర్యపరిచింది. డాగోన్‌ల గ్రామానికి మరింత ప్రత్యేకతను చేకూర్చింది బావోబాబ్ చెట్లే. వీటి ఆకారమూ విచిత్రంగానే ఉంటుంది. ఈ చెట్లు, పర్వత చరియలు ఆ గ్రామాన్ని లోకం కంటికి కనిపించకుండా చేశాయి. ఇప్పటికీ పర్యాటకులు వెళితే డాగోన్‌లు ఇబ్బందికరంగా కనిపిస్తారు. వారికి సంబంధించిన పవిత్ర కట్టడాల్లోకి అనుమతి లేకుండా ప్రవేశించడం ఓ కారణమైతే.. ఏది ఇల్లో.. ఏది కాదో తెలీక డాగోన్‌ల కుటుంబాలకు తలనొప్పి తెప్పిస్తుంటారు సందర్శకులు. ఇప్పుడిప్పుడే పర్యాటకుల కోసం ఏర్పాట్లు పెరుగుతున్నాయి. అక్కడి డాగోన్ హోటళ్లు కూడా పూర్తిగా మట్టితో తయారైన కట్టడాలే. గదులకు కిటికీలు సాధారణంగా ఉండకపోవడంతో కొత్తవాళ్లు తడబడతారు. భయపడతారు. యండోమా గ్రామం కూడా ఇదే తరహాలోనే కనిపిస్తుంది. డాగోన్‌లు తమ శైలి ఇళ్లను ఎక్కడ అనుకూలత దొరికితే అక్కడ నిర్మించారు. రెండంతస్తుల మట్టి ప్యాలెస్ ఇక్కడ ప్రత్యేకం. ప్రహేళికలాంటి గజిబిజి దారులు ఎటు వెళ్తున్నారో తెలీకుండా చేస్తుంది. గ్రామం మధ్యలో వచ్చే హోగోన్ కట్టడం వారి గ్రామ రక్షక దేవతది. విచిత్రంగా వీరి సృష్టి దైవం పేరు కూడా 'అమ్మ'. ఆ దేవత కోసం గ్రామం పైభాగాన తొలిచిన భారీ రంధ్రాల్లో ఆస్ట్రిచ్ గుడ్లను నివేదిస్తారు. భర్త మరణించిన స్త్రీల కోసం గ్రామం కొసన ఓ గృహాన్ని ఏర్పాటు చేసి.. ఆమె తన అక్క చెల్లెళ్లతో మూడు వారాల పాటు గడిపి పూర్తిగా కోలుకున్నాక గ్రామంలోకి తీసుకువస్తారు. ఇక పండగలకి పబ్బాలకి పర్వతం మీద ఏర్పాటు చేసుకున్న యుగా డొగొరు గ్రామం వేదిక అవుతుంది. 60 ఏళ్లకు ఓసారి జరుపుకునే ఓ భారీ పండుగ కోసం ఇది ఎదురుచూస్తుంటుంది. ★



కథా నిలయం

## ఇండెక్స్


స్ఫూర్తి ................3
మరో స్లమ్‌డాగ్

సేవ ........4
అడవి సైనికుడు

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10
బాబోయ్ ఇల్లోయ్

తెలుసా............... 11
చదివేయండి

కవిత్వమ్...............14
నరుడా ఏమి నీ కోరిక

చిత్రం భళారే ఈ చిత్రం

అట్టమీది కథ...6

ఆపాత చిత్రం- 12

కథ ................15
పోపుల పెట్టె

కొత్త పుస్తకాలు ...........18
హాస్య నటులకు మార్గదర్శకం

విజేత ...........20
మత్తును ఓడించిన కిక్కు

రుచి.....................21
సపోటా ఐస్ క్రీమ్

బాల నేస్తాలు............23
13 ఏళ్లు 100 టోర్నమెంట్లు

పద వికాసం........24


## చదివించాయి

ఆదివారం అనుబంధం సంచిక ప్రతి వారమూ నూతనత్వానికి దారితీయడం ఆనందాన్ని కలిగించింది. ఈ తరం వారిని ఆకట్టుకునే అంశాలతోపాటు పాత తరం వారిని అలరిస్తున్న ఆపాత చిత్రం లాంటి అంశాలెన్నో నన్ను అమితంగా ఆకట్టుకున్నాయి. అన్ని తరాల వారినీ చదివించే విషయాలని ప్రచురించడం నిజంగా అభినందనీయం. 'వెలుగు నీడలు' చిత్రంలోని ప్రతి ఫ్రేమ్‌ని చక్కగా వివరించారు రచయిత. ఆత్రేయ గారి పాటలు చిత్రానికి హైలెట్‌గా నిలిచాయి. దర్శక రత్న విక్టరీ మధుసూదన రావు ప్రతిభ కళ్ళకుకట్టినట్టు చేసిందీ వ్యాసం. కథాబలం, సాహిత్యం, ఇంపైన సంగీతం మొత్తంగా ఈ చిత్రం విజయానికి బాసటగా నిలిచాయి.

– కై.ప నాగరాజు, అనంతపురం.

## గమ్మత్తు ఆటలు

**20.8.2017** స్నేహ సంచికలో అట్టమీది కథ 'గమ్మత్తు ఆటలు' ఆకట్టుకుంది. చెస్సూ బాక్సింగ్, బెడ్ రేసింగ్, కాలివేళ్ళతో ఫైటింగ్, సంగీతంతో బోసాబాల్ లాంటి క్రీడలన్నీ అబ్బురపరిచాయి. ఫుట్‌బాల్ క్రీడలో అమ్మాయిలని స్టార్ ఆటగాళ్ళ స్థాయికి చేర్చిన బెంబెంకి హ్యాట్స్ ఆఫ్. ఆపాత చిత్రం 'నీడల జాడలు' చదివించింది. చిత్రానికి కథాబలంతోపాటు పాటలు హైలెట్. చివరి అట్టపై వచ్చిన 'కదలాడిన చిత్రాలు', 'బతుకు చిత్రం' బొమ్మలు ఆకట్టుకున్నాయి. 'కాటుక కరిగింది' కథ, 'బానిసబతుకులు', 'ఆఫీసులో హెల్మెట్', 'అట్ట వడ్రంగి', 'ఇన్‌స్టా నెరపు', 'ప్రకృతి చిత్రకారుడు' బాగున్నాయి. నవ్వుల్ పువ్వుల్ నవ్వు తెప్పించాయి.

– అనన్య, విజయవాడ

## ఆ రోజుల్లో అండమాన్ జైలు

అట్టమీది కథ 'ఆ రోజుల్లో అండమాన్ జైలు' ఒళ్ళు జలదరింపచేసింది. దేశంలో స్వాతంత్ర్య పోరాటాన్ని అణచడానికి అండమాన్ జైలును ఏర్పాటు చేయటం బ్రిటీషు సామ్రాజ్యవాదుల కుటిల భావజాలానికి అద్దం పట్టింది. స్వాతంత్ర్య సమర యోధుల్ని దేశభక్తుల్ని బానిసల్ని తప్పించుకోవడానికి వీలులేకుండా అండమాన్ జైలులో నిర్బంధించి, వారిని కఠిన శిక్షలకు గురిచేసిన వైనం చదువుతుంటే భయం వేసింది. మరీ కఠినమైన విధానంలో సెల్యులార్ జైలును ఏర్పాటు చేయడం దారుణమైన విషయం. ఉద్యమంలో పాల్గొన్న వారిని నిర్దాక్షిణ్యంగా ఉరి తీయడం అమానవీయం. ఇంతమంది ఆత్మార్పణలతో వచ్చిన స్వాతంత్ర్యాన్ని రక్షించుకోవాలి. సరోజిని అగర్వాల్ కూతురు మనీషా మరణంతో క్రుంగి పోకుండా ఆమె స్మృతి చిహ్నంగా ఎందరో అనాథ బాలలను అక్కున చేర్చుకొని పెంచి పెద్ద చేసి వారికి ఉత్తమ జీవితాన్ని అందించటం ఆమెలోని మానవీయ స్పృహను వెల్లడిస్తోంది. సరోజినీ నిజంగా అభినందనీయురాలు. అదే మనం వారికిచ్చే నిజమైన నివాళి.

– మంకు శ్రీను, కొప్పర్రు

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ENTERED

భారతీయ సంతతికి చెందిన ఎంతో మంది వ్యాపారవేత్తల గురించి మీరు తెలుసుకునే వుంటారు. అయితే ఇక్కడ మనం ఒకరి గురించి తెలుసుకోవాలి....ఢిల్లీలోని స్లమ్‌ల్లో చిన్న చిన్న ఉద్యోగాల నుంచి విదేశాల్లో సొంతగా ఓ కంపెనీ పెట్టే స్థాయికి చేరుకున్నాడతను. మనం కొనే వస్తువులకి సంబంధించిన పూర్తి వివరాలందించే బ్లిప్పర్ యాప్ తన ఆలోచనే. ఆ యాప్ గురించి తెలుసుకోవాలంటే అంబరీష్ గురించి చదవాల్సిందే...

# మరో స్లమ్‌డాగ్




ఎప్పుడు ఏ వస్తువు కొన్నా మనల్ని ఓ ప్రశ్న వెంటాడుతుంటుంది. అదేనండీ వస్తువు నాణ్యతకి సంబంధించి. ప్యాక్డ్‌ఫుడ్స్, శీతల పానీయాలు, మనం కొనితెచ్చుకునే వివిధ ఆహార పదార్థాలు, ఇంట్లో మనం వాడుకునే వస్తువులు ఇలా ఏది కొన్నా వాటి ధర మాత్రమే ఎక్కువమంది గమనిస్తుంటారు. అయితే సదరు వస్తువు ఎలాంటి పదార్థాలతో తయారయ్యింది వాటిని ఎక్కడ తయారు చేశారు, ఎక్స్‌పైరీ ఇలా ఒక వస్తువుకు సంబంధించి మనం తెలుసుకోవాల్సింది చాలానే వుంది. వస్తువులపై కొద్దో గొప్పో వివరాలు తప్ప పూర్తి వివరాలు లేకపోవడంతో చాలా వివరాలని మనం తెలుసుకోలేక పోతున్నాం. ఏదో ఒక నష్టం జరిగాక గానీ వాటిపై శ్రద్ధపెట్టరు చాలామంది. కాయగూరలు, పళ్ళు లాంటివి సరే గానీ మరి ప్యాక్డ్ ఫుడ్స్‌కి సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవడం కాస్త కష్టమనేది కొందరి వాదన. ఇలాంటి సమస్యలన్నింటికి ఓ యాప్ ద్వారా చక్కని పరిష్కారాన్నిచ్చాడు అంబరిష్. నిజానికి తన జీవితంలో చోటు చేసుకున్న పరిణామాలు కూడా అంతే ప్రత్యేకంగా వుంటాయి. జార్ఖండ్ లోని ధన్

భాగ్‌లో ఓ మధ్య తరగతి కుటుంబం తనది. చిన్నప్పటి నుండి చదువు కంటే కొత్త విషయాలు తెలుసుకోవడంపైనే శ్రద్ధ పెట్టేవాడు. అలా కంప్యూటర్స్‌పై ఇష్టాన్ని పెంచుకున్నాడు. తండ్రి ఇంజినీరింగ్ చదవమని వత్తిడి చేయడం కష్టమనిపించింది తనకి. ఇక ఇంటి నుండి వెళ్ళిపోవాలనుకున్నాడు. ముంబాయికి వెళుతున్నట్టు లెటర్ రాసి ఇంటి నుండి బైటికెళ్ళిపోయాడు అంబరీష్. అయితే తను చేరుకుంది మాత్రం ఢిల్లీకి. కొన్ని రోజులు పస్తులున్నాడు. ఆ తర్వాత రాజధాని నగరంలోని స్లమ్‌లో ఓ చిన్న షెడ్‌లో తలదాచుకునే చోటుదొరికింది తనకి. కనీస సదుపాయాలు లేని ఆ ప్రాంతంలో తనకి పేదరికంతో వున్న వారి కష్టాలేంటో అర్థమయ్యాయి. టీ షాపులో పనిచేయడం, మ్యాగ్జైన్‌లని అమ్మడం ఇలా రోజుకి రెండు మూడు పనులతో డబ్బు సంపాదించడం నేర్చుకున్నాడు అంబరీష్. అయితే ఓ రోజు న్యూస్ పేపర్‌లో వచ్చిన ఓ యాడ్ తన జీవితాన్ని మలుపు తిప్పింది. ఓ మంచి బిజినెస్ ఆలోచనతో ముందుకొచ్చిన వారికి పెద్ద మొత్తంతో ప్రైజ్ మనీని ప్రకటించిన ఓ యాడ్‌ని చూశాడు అంబరీష్. దిగువ మధ్యతరగతి మహిళలకు ఉచితంగా ఇంటర్నెట్ అందుబాటులోకి తేవడం ద్వారా వారు కుటుంబానికి ఆర్థికంగా సాయపడగలరంటూ తను వ్యక్తపరిచిన ఆ ఆలోచన తనకి క్యాష్ ప్రైజ్‌ని తెచ్చిపెట్టింది. ఆ డబ్బుతో సొంతగా 'ఉమెన్ ఇన్ఫో' అనే ఓ సంస్థని ప్రారంభించాడు అంబరీష్. వెబ్ పేజీల్లో యాడ్‌ల ద్వారా వచ్చే డబ్బు ఈ సేవలని కొనసాగించడంలో ఉపయోగపడేది. అలా మహిళలకి ఇంటర్నెట్ శిక్షణతోపాటు ఉచితంగా సమాచారాన్ని అందించేందుకు ఉమెన్స్ ఇన్ఫోలో దాదాపు 55 మందికి ఉద్యోగ అవకాశాన్ని కల్పించాడు. ఉమెన్ ఇన్ఫో ఫార్మ్ ద్వారా తొలిసారిగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాడు అంబరీష్. అప్పటికి తన వయసు 16 ఏళ్ళు. జీవితంలోని ఒక్కో మజిలీతో బిజినెస్ పాఠాలని వంటబట్టించుకుంటూ మంచి వ్యాపారవేత్తగా రాణించగలిగాడు. ఆ తర్వాత యుకెలో టెక్నాలజీకి సంబంధించి ఓ కంపెనీని మొదలు పెట్టినా కొంతకాలానికే అది మూతబడింది. ఆ తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిన ఇన్ఫ్రానెట్ పనుల్లో కొనసాగడంతోపాటు వివిధ వ్యాపారాల్లో కొనసాగిన తనకి ఎన్నో చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఓ రోజు సరదాగా తన స్నేహితుల చిత్రాలని ఫొటో యానిమేషన్ చేస్తున్న తనకి బ్లిప్పర్ యాప్ ఆలోచన వచ్చింది. మార్కెట్‌లో లభించే వివిధ వస్తువులపై వుండే బొమ్మలని(లోగొ) మొబైల్ ఫోన్ ద్వారా స్కాన్ చేయడం ద్వారా వాటికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకునేలా బ్లిప్పర్ యాప్‌ని తయారు చేయాలనుకున్నాడు అంబరీష్. స్నేహితుడు తెయబ్‌తో కలసి 2011లో ఓ స్టార్టప్ కంపెనీగా బ్లిప్పర్ సేవలు అందుబాటులోకి తెచ్చాడు. అయితే వినియోగదారులకి ఈ సమాచారం అందించాలంటే ముందుగా సదరు కంపెనీ అనుమతులు తీసుకోవాల్సి వుంటుంది. కొన్ని కెంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. మరి ఈ కంపెనీలు తయారుచేసే ఉత్పత్తుల పూర్తి సమాచారాన్ని మనం తెలుసుకోవాలంటే మన స్మార్ట్‌ఫోన్‌లో బ్లిప్పర్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాల్సి వుంటుంది. వస్తువులపై వుండే లోగొలని స్కాన్ చేయడం ద్వారా క్షణాల్లో సమాచారాన్ని అందించే ఈ యాప్ ఇప్పటికే దాదాపు 11పైగా దేశాల్లో ఫేమస్ అయ్యింది. యుకె, అమెరికా, కెనడా, భారత్ దేశాల్లో 67,000 మంది విద్యార్థులు ఈ యాప్ ద్వారా నాణ్యతపైనా అవగాహన పెంచుకుంటున్నారు.

- శర్వాణి

ఉత్తరాఖండ్‌లోని ఓ మారు మూల గ్రామం అది. ఎత్తైన ఆ కొండ ప్రాంతంలో పసుగ్రాసం కలప కోసం మహిళలు ట్రెకింగ్ చేయాల్సి వుంటుంది. ఇక వ్యవసాయం చేయడం దాదాపు సాధ్యపడదనే చెప్పాలి. అలాంటి ప్రాంతంలో జీవవైవిధ్యాన్ని కాపాడడంతోపాటు అక్కడి ప్రజల అవసరాలని తీర్చేందుకు అటవీ వ్యవసాయంతో ఓ చక్కని పరిష్కారాన్ని చూపాడు జగత్ సింగ్ చౌదరి. ఓ బిఎస్ఎఫ్ జవాన్ 40 ఏళ్ళుగా ఇలా అటవీ పరిరక్షకుడిగా ఎందుకు మారాడో మీరే తెలుసుకోండి.

# అడవి సైనికుడు

జగత్ సింగ్ గురించి చెప్పాలంటే మనం ఓ నలభై ఏళ్ళు వెన్నక్కి వెళ్ళాలి. ఉత్తరాఖండ్‌లోని కొట్ మల్ల అనే మారుమూల గ్రామం తనది. బిఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నాడు జగత్ సింగ్. ఓ సారి సెలవులకి సొంతూరికి తిరిగొచ్చిన జగత్ సింగ్‌కి తన గ్రామంలోని ఓ మహిళ పసుగ్రాసం కోసం పర్వతాలపైకెక్కుతూ జారిపడి చనిపోయిందనే వార్త గుండెల్ని మెలిపెట్టింది. కొట్‌మల్లతో పాటు పరిసర గ్రామాల్లో ఇలాంటి ప్రమాదాలు కొత్తేంకాదు. నిజానికి కొన్నేళ్ళ క్రితం అక్కడ జరిగిన అటవీ నిర్మూలన కారణంగా మహిళలు ఆహార పదార్థాలు, పసుగ్రాసం, కలప ఇలా ఏది కావాలన్నా ఎత్తైన కొండలపైకెక్కే సాహసం చేయాల్సిందే. ఇలాంటి పరిస్థితులన్నీ తనని కదిలించాయి. ఈ సమస్యకి పరిష్కారం కోసం ఆలోచనలో పడ్డజగత్ సింగ్‌కి అటవీవ్యవసాయ ఆలోచన తట్టింది. అలా గ్రామంలో తన తండ్రికి సంబంధించిన ఒక బంజర భూమిలో సేద్యం చేయడం మొదలు పెట్టాడు జగత్ సింగ్. భూమిని చదును చేయడంతోపాటు మొక్కలు నాటడం ఇలా అన్నీ ఒక్కడే చేసుకోవాల్సి వచ్చేది. అడవుల నరకివేత కారణంగా గ్రామంలో నీటి వనరులు కూడా తగ్గిపోయాయి. అయితే మూడు కిలోమీటర్ల దూరంలో వున్న ఒక చిన్న కొలను నుండి నీటిని తీసుకొచ్చి మొక్కలకందించేవాడు జగత్ సింగ్. ఇలా తన సెలవు రోజులన్నీ పూర్తిగా మొక్కలు పెంచడానికే కేటాయించాడు. జవానుగా దేశరక్షణతోపాటు మొక్కల పరిరక్షణ తనజీవితంలో బాగమయ్యింది. 1980లో బిఎస్ఎఫ్‌లో రిటైర్ అవ్వడంతో ఇక పూర్తి సమయం చెట్టని పెచండానికే కేటాయించాడు. తన పెంక్షన్ డబ్బుని కూడా మొక్కల కోసమే ఉపయోగించాడు. పసుగ్రాసానికి ఉపయోగపడే నమ్‌చా, తెలియాతోపాటు పూలమొక్కలు, ఔషద మూలికలు, కూరగాయలు, దుంపలు, పప్పులు, మసాలా దినిసులనందించే మొక్కలు, దేవదారు, ఒక్ చెట్లు ఇలా దాదాపు 56 రాకాల మొక్కలతో ఒక అటవీ ప్రాంతం ఏర్పడింది. కూరగాయలు, పండ్లని అమ్మడం, తెనెటీగల సాగు లాంటి పనులతో అక్కడి ప్రజలకి ఉపాధి కల్పించాడు. చెట్లని పెంచడం ద్వారా అక్కడ చోటుచేసుకున్న పర్యావరణ మార్పులు నీటికొరతని తగ్గించాయి. అలా మహిళలు పశు గ్రాసం, నీళ్ళ కోసం మైళ్ళ దూరం వెళ్ళే అవసరం తగ్గిపోయింది. వెదురు, జామాయిలు, బీటెల్ రకరకాల పండ్ల చెట్లని పెంచడం ద్వారా జీవవైవిధ్యానికి చోటుదక్కింది. నలభై ఏళ్ళుగా జగత్ సింగ్ కృషి ద్వారా కొట్‌మల్లలో దాదాపు 1.5 హెక్టార్ల విస్తీర్ణంలో ఓ అటవీ ప్రాతం ఏర్పడింది.

నిజానికి ఉత్తరాఖండోలోని ఇతర ప్రాంతాల్లో ఎక్కడా కనిపించని మొక్కలు జగత్‌సింగ్ అడవిలో మనకి దర్శనమిస్తాయి. జగత్‌సింగ్ అటవీ పరిరక్షణ పనులు ఇతర గ్రామాల్లో ప్రజలకీ ప్రేరణనిచ్చాయి. అలా చుట్టుపక్కల గ్రామాల్లో ఈ పద్ధతుల్లో మొక్కలని పెంచడం మొదలుపెట్టారు. జగత్ సింగ్ అటవీ వనాన్ని సందర్శించిన అప్పటి ఐఎఎస్ అధికారి ఆర్ఎస్ తొలియా ఉత్తరాఖండ్‌లోని రైతులందరూ జగత్ సింగ్ అనుసరించిన మిశ్రమ వ్యవసాయ పద్ధతులని అనుసరించాలంటూ ఉత్తర్వులని జారీచేశారు. గ్రామ అభివృద్ధికి తన నిరవధిక కృషికి గాను 'హిమ్ గౌరవ్', 'వృక్షమిత్ర', 'పర్యావరణ్ ప్రేమి' లాంటి బిరిదులని అందుకున్నాడు జగత్ సింగ్. పర్యావరణ పరిరక్షణ దిశగా తనుచేసిన కృషికి ఉత్తరాఖండ్ ప్రభ్వుం తనని సన్మానించింది. అలా ప్రభుత్వం ద్వారా తను అందుకున్న ఉబ్బు మొత్తాన్నీ తన గ్రామంలో నిరుద్యోగ యువతకి విరాళంగా అందించాడు. శ్రీనగర్‌లోని గర్వాల్ యూనివర్సిటీలో అటవీ వ్యవసాయ పద్ధతులని తమ యూనివర్సిటీ క్యాంపస్‌లో ప్రవేశ ప్రవేశపెట్టేందుకు జగత్‌సింగ్‌కి ఆహ్వానం పంపింది. మూడేళ్ళలో యూనివర్సిటీ క్యాంపస్‌లో అలా ఓ అటవీ వనాన్నే తయారు చేశాడు జగత్ సింగ్. ఏడు పదుల వయసులో సేంద్రీయ ఎరువులని తయారుచేసే విధానతోపాటు గృహ అవసారలకి ఉపయోగపడే మొక్కలని పెంచడంలో కొత్త పద్ధతుల్ని కనిపెట్టడంలో బిజీగా కనిపిస్తాడు జగత్ సింగ్ చౌదరి. పర్యావరణ శాస్త్రంలో డిగ్రీ పూర్తిచేసిన కొడుకు దేవ్ కూడా ఇప్పుడు తండ్రి మార్గంలోనే ప్రయాణిస్తున్నాడు.

# నవ్వుల్ - పువ్వుల్

## మొక్కే కదా

**మొదటి ఖైదీ :** నిన్నెందుకు అరెస్టు చేశారు?
**రెండో ఖైదీ :** కొన్ని చెట్లని పెంచి మరికొన్ని చెట్లని నరికా.....
**మొదటి ఖైదీ :** అంతేనా ఇంతకీ ఏం చెట్లు అవి?
**రెండో ఖైదీ :** గంజాయి చెట్లని పెంచి ..... గంధం చెట్లని నరికా....!



## అతితెలివి

**టీచర్ :** రామూ నువ్వూ గోపీ లెక్కల్లో ఒకే తప్పు చేశారేంటి??
**రాము :** మా ఇద్దరికీ లెక్కలు చెప్పింది ఒక్కరే కదా టీచర్....
**టీచర్ :** ఆ....



## టికెట్స్ కలర్ వేరు

**ఎస్ఐ :** సినిమా థియేటర్ దగ్గర బ్లాక్ టికెట్లు అమ్మే వారిని పట్టుకోమన్నాగా....
**కానిస్టేబుల్ :** చూశా సార్, అక్కడ టికెట్లన్నీ పసుపు, గులాబి రంగుల్లోనే ఉన్నాయి.!

### కిసుక్కు సిత్రం



హోమ్ థియేటర్..!

## కిసుక్కు

**ధర్మారావు :** మీరు ఆస్తి కులా..??నాస్తికులా??
**కృష్ణారావు :** నాకు ఆస్తి లేదు.. నాస్తికుణ్నే!

## అంతక ముందు

**రామారావు :** నీ పెళ్ళికాక ముందు నీ భార్య ఏం చేస్తుండేది.
**వెంగళప్ప :** నాకు పెళ్ళికాక ముందు భార్య లేదండీ!

## కుటుంబం అంతా

**అప్పారావు :** సినిమాకి వెళతానని థియేటర్ వరకు వెళ్ళి తిరిగి వచ్చేశావేం?
**వెంగళప్ప :** పోస్టర్ మీద కుటుంబం అంతా కలిసి చూడాల్సిన చిత్రమని రాసుంది మరి!
**అప్పారావు :** ఆ.......

### నాకు నచ్చిన చిత్రం

ఆక్సిజన్ మాస్క్

సేకరణ: కె.లక్ష్మణ్, నులకపేట

# చిత్రం భళారే ఈ చిత్రం



ఒక్క నిమిషం.. ఒక కదిలే దృశ్యం.. ప్రపంచాన్ని విస్మయంలోకి నెట్టేసింది. ఓ చిత్తరువుకు ప్రాణం వచ్చింది. ఓ సరికొత్త కళాత్మక ప్రపంచం ఊపిరి తీసుకుంది. అటు వైపే లోకం పరుగులు పెట్టింది. ఆ తెరపై పడే నలుపు-తెలుపుల ఛాయలే కాలానికి ప్రతీకాత్మకమయ్యాయి. రంగులు అద్దుకుని, మూడో తలంపైనా వాలి, అదే వాస్తవిక ప్రపంచంగా మారి చిత్రం ఎన్నో విచిత్రాలు చేసింది. సెల్యూలాయిడ్‌పై తిరిగినపుడు... డిజిటల్‌గా నిక్షిప్తమైనపుడూ ఏ దశలోను దానిపై మన అభిమానం తగ్గలేదు. దశ మారుతున్న కొద్దీ మరింత సినిమా పిచ్చోళ్లను చేస్తోందీ చిత్రం భళారే ఈ చిత్రం.

- అజయ్ కుమార్ వారాల
9502395077

ఓ చిత్ర ప్రదర్శన. తెర ముందు కూర్చున్న వారికి ఏమి అర్థం కావడంలేదు. తెల్లని తెర ఎప్పుడు అడ్డు తొలగిస్తారు. ప్రదర్శన ఎప్పుడు చూస్తామనే గుసగుసలు మొదలయ్యాయి. ఇంతలో ప్రొజెక్టర్ కాంతి దాని మీద పడింది. ఏదో అస్పష్టంగా కనిపిస్తోంది. ఇంతలో దూరం నుంచి రైలు వస్తున్నట్టు గమనించారు. అది తమ వైపే వస్తోంది. మరీ దగ్గరవుతోంది. ఢీకొంటుందేమో అని భయపడి పక్కకు జరిగారు. కొందరు కేకలు వేశారు. గుట్టు చప్పుడు కాకుండా ఇలా వచ్చేస్తుందేంటి రైలు పట్టాలు కూడా లేవే.. అనుకున్న వాళ్లంతా ఒక్కసారిగా విస్మయానికి గురయ్యారు. ఆ రైలు కొంత సేపటి నుంచి తెరపైనే కదలాడుతోంది. అంటే అది తెరపై కదలుతోన్న దృశ్యం ఆశ్చర్యపోయారు. అంతకు ముందు అంత విస్మయకరమైన విషయం ఎప్పుడూ చూడలేదు. అది సినిమా అని చెప్పగానే దాన్ని ఇంకెప్పుడూ మర్చిపోని సినీ జనం పోగయ్యారు. ఓ సినీ ప్రపంచాన్ని పోషిస్తున్నారు. అభిమాని అంటే ఎలా ఉంటాడో చూడాలంటే సినిమా ఫ్యాన్‌ను పరిశీలిస్తే చాలు. కిరాణా కొట్టు దగ్గర కాసేపు కూడా ఆగలేనివాడు చాంతాండ క్యూల్లో ఓపిగ్గా నిల్చోగలడు. ఇష్టమైన చొక్కా జేబు చిరిగినా ఫర్లేదు. పర్స్ ఎవరైనా కొట్టేసినా ఫర్లేదు. ఊపిరాడక కళ్లు తిరిగినా ఫర్లేదు. టికెట్ చేతికొస్తే చాలు. తొలి రోజు తొలి ప్రదర్శనకు ఓ కుర్చీ మిగిలితే చాలు. అభిమానికి ఆ రోజు పండగే. చిత్రం భళారే విచిత్రం. ఇంత పిచ్చిగా సినిమా ప్రేమించడానికి దానిలోని గమ్మత్తే కారణం. అది నలుపు తెలుపుల్లో మసక మసకగా కనిపించినా నేలపై కూర్చునే తెరకు కళ్లను అప్పజెప్పేశారు. ఆ తర్వాత రంగుల్లో వస్తే వారెవ్వా అనుకుని కుర్చీ ముందుకు జరిగారు. 3డిలో, 8డిల్లో థ్రిలిస్తే సోఫాకు అతుక్కుపోయి చూస్తున్నారు. సినిమా గురించి చెప్పాలంటే ప్రేక్షకుడి గురించే ఎక్కువ చెప్పాలి. వీక్షకుడి ఆదరణ లేకుంటే సినిమాకు శుభం కార్డు పడేదేమో. ఎంతగా ప్రేక్షకుడు మెచ్చాడో... భళ.. భళారే అన్నాడో తెలియాలంటే వందేళ్ల సినిమాలోని జరిగిన పరిణామాలు.. వాటికి తగ్గట్టు ప్రేక్షకుడి అభిరుచులు.. తెలియాలి. సినిమాను చూసేందుకు అతడు పడుతోన్న ప్రయాసను గమనించాలి.

## సినీ యానం

సాయంత్రాలకే లాంతర్లు వేసుకునే రోజులు. భద్రాచలం చుట్టుపక్కల అడవుల్లో చిన్న చిన్న గ్రామాలు. రాత్రుళ్లు జనసంచారమేమో గానీ, అడవి జంతువుల సంచారం కచ్చితంగా ఉంటుంది. పులి గాండ్రింపులు నుంచి కోడి కూతల మధ్య రాత్రి జరిగిపోతుంది. కానీ సినిమా చూడాల్సిందే. విజయవాడలోనే ఆ పిచ్చి అంటుంకుంది. ఏం చేయాలి. మధ్యలో ఓ గ్రామ దేవత చిన్న గుడి. అక్కడ మాత్రం ఎడ్లను కట్టేసి నిద్రలు కానిచ్చి తెల్లారాక ఊళ్లలోకి జనాలెళతారు. అదో విశ్రాంతి కేంద్రం. అక్కడ నుంచి థియేటర్ దగ్గర. ఓ బ్రిడ్జి దాటేస్తే సరి. పొద్దునే వంటలు చేసుకుని క్యారేజీల్లో కట్టుకుని ఓ కుటుంబం బయలుదేరింది. రాములోరి గుడి చూడ్డానికే కాదు. కొత్త సైన్మా వేస్తున్నారు. మరో పాత సినిమా కూడా మరోసారి చూసేయాలి. పిల్లల్ని పోగేసుకుని ఎడ్ల బండి ప్రయాణం కట్టారు. ప్రదర్శన ఇంకా ఉందనగానే అరగంట ముందే వాలిపోయారు. ఏంటో మిగతా ప్రయాణాల కన్నా ఈ ప్రయాణంలోనే సినిమా పాటలు మరింత బిగ్గరగా వినిపిస్తాయి. పిల్లల కోరస్‌లో ఉత్సాహమంతా తెలుస్తుంది. ఓ ప్రదర్శన పూర్తయ్యాక చకచకా భోజనం చేసేసి మరో ప్రదర్శనకు మూతులు తుడిచేసుకునేవారు. కొత్త సినిమాను నేల మీదే కూర్చుని చూస్తూ ఆశ్చర్యపోయాక.. ఈ పాత చిత్రానికి మాత్రం బల్ల దొరికింది. ఒక్కోసారి కుర్చీ కూడా జాగా ఇస్తుంది. ఎక్కడ కూర్చుని చూశామన్నది కాదన్నయ్యా... ఆ రోజుల్లో పిక్చర్ తెరపై పడిందా లేదా అనేదే పాయింట్. మన ఆపాత మధురాల్లోని ఒక్కో రసం తెరపై ఒలుకుతుంటే.. ధార పట్టే కన్నీళ్లు.. పక్కనోణ్ని కొట్టీ మరీ నవ్వుకునే తమాషాలు... ప్రేయసి కళ్లలో మెదిని రొమాంటిక్ సన్నివేశాలు... మళ్లీ గుర్తెరిగే ఇంటి బాధ్యతలు.... ముఖ్యంగా శ్రమనంతా మర్చిపోయి సేద తీర్చే ఆహ్లాదాలు... అన్నింటినీ మూడు గంటల్లో ఇచ్చేస్తుంది సినిమా. తెరపై ఎస్వీయార్ కనిపిస్తే రోమాలు నిక్కబొడుచుకోవడం.. సావిత్రి ఎదురైతే కంటిలో తడి చేరడం.. ఇక ఎన్టీయారో, ఏఎన్నారో కదులుతుంటే చేతులు కలవడం.. ఓ రకంగా తెరే మంచి హిప్నటైజరేమో. అనేక భావనలు.. అనేక ఉద్వేగాలు.. అనేకానేక



అచ్చెరువులు. ఆపాత మధురాలు ఆ రోజులు. సినిమా వెతుక్కుంటూ పోవడం... ఊరికే సినిమా రావడం... రెండూనూ పండగ ప్రయాణాలే. అదేంటో నలుపు-తెలుపుల్లో సినిమా చూసినా కూడా రంగుల్లో దృశ్యం కనిపించేది. ఇప్పుడేంటో పాత కాలం అనగానే రంగులన్నీ మాయమై ఓ బ్లాక్ అండ్ వైట్ దృశ్యం గుండెల్లో మెదులుతుంది. ఈ చిత్రం ఒక్క సినిమానే చేయగలిగింది. పాత రోజులంటేనే నలుపు-తెలుపుల్లో చూసేంతగా నమ్మించేసింది. ఇప్పటి చిత్రాల్లో కూడా చాలా వెనక్కు తీసుకెళ్లే ఫ్లాష్ బ్యాక్‌లు రంగుల మధ్య నలుపు-తెలుపుల్ని అందంగా తెరకెక్కించేస్తున్నాయి. దసరా పండక్కో బుల్లోడొచ్చి మంచి మాట ఊళ్లో వేస్తాడు. మాంచి సినిమా కలెక్షన్‌తో సినిమా గుడారం వస్తోందని. ఊళ్లోని కుర్రోళ్లే తలా చేయి వేసి వేదికను సిద్ధం చేసేస్తారు. ఇసుక చల్లేసి చదును చేస్తారు. తొంభై దాటిన బామ్మ నుంచి మాటలు నేరుస్తున్న బుడ్డోడి వరకు అందరికీ జాగా కావాలి మరి. రీలు తిరిగిందే తిరుగుతూ పల్లెను జాగారాలు చేయిస్తుంటుంది. అస్సలన్ని ఎడ్ల బళ్లు ఊళ్లో ఉన్నాయా అని ఆశ్చర్యమేసేస్తుంది. పక్కూరోళ్లు కూడా వచ్చారని తెలిసి రాత్రి భోజనాలు మిగిలాయా అని అడుగుతూ ఫలహారాలు పంచేసి అతిథి మర్యాదలు చేసేస్తారు. సినిమా అంటే సమిష్టి పండగని అనిపిస్తుంది ఇలాం టివి వింటే. చిత్రం భళారే విచిత్రం.

### మూగ మనసులు

టాకీల హల్‌చల్ మొదలవ్వక ముందు కదిలే దృశ్యానికే ప్రాధాన్యత. 1890ల నుంచే సినిమా మెల్లిగా తెరపైకి వచ్చినా. 1900 దాటి దాటాగానే దాని స్వరూపం మారిపోయింది. సృజనాత్మకతలో విశ్వరూపం ప్రదర్శించింది. నిమిషాల నిడివి నుంచి గంటల తరబడి వినోదాన్ని పంచేస్థాయికి పెరిగింది. 1920ల్లో మూకీల ప్రభంజనం తారాస్థాయికి చేరింది. కేవలం దృశ్యం ద్వారానే ప్రేక్షకుడిని మెప్పించాలి కాబట్టి స్పెషల్ ఎఫెక్ట్స్ అనే మాట వినబడటం మొదలైంది. కొన్ని సంఘటనలు చూసేందుకే కాక పూర్తి జీవితాల్ని గంటల్లో తడిమేసే ఫీలింగ్‌ను వీక్షకుడు పొందాడు. నవలలు, పుస్తకాల నుంచి స్క్రిప్ట్‌లు తయారయ్యాయి. చరిత్ర, నూతన పోకడలు మరింత స్పష్టంగా కనిపించాయి. కామెడీకి, డ్రామాకు ప్రత్యేక జోనర్లు వచ్చాయి. సినిమా నటులు ఆరాధ్య తారలయ్యారు. సెలబ్రెటీల్ని మించి కుటుంబ సభ్యుల్లాంటి ఆదరణ, ప్రేమల్ని చూరగొన్నారు. ప్రేక్షకుడు సినీవేల్పుకు ఇలలో పెద్ద కొడుకు, కూతురి స్థానాల్నిచ్చారు. సినీ తారల జీవితాల గురించే ఆరేడు దశాబ్దాల క్రితమే ప్రత్యేక మేగజీన్లు నడిచాయంటే అభిమాని వ్యామోహం ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. ఈ అగ్గిపెట్టె, ఆ సబ్బు బిళ్ల వాడాలని బ్లాక్ అండ్ వైట్ రోజుల్లోనే యాడ్‌లు వచ్చేశాయి. తారలు బ్రాండ్ అంబాసిడర్లు కావాల్సిన పరిస్థితి ఫ్యాన్ ఫాలోయింగ్ కల్పించింది. ఇదంతా సైలెంట్ సినిమా చేసిన మాయాజాలం. మన కళ్లకు, పెదవి వంపుకు, దేహ కదలికలకు ఎక్కడలేని విలువను ఆపాదించిన మూకీని కేవలం సాంకేతిక లేమి కట్టడి చేయలేదు. ఇప్పుడు మనం చూస్తున్న టాకీలకి మూకీలకి దృశ్యంలో నటన తీరులో చాలా తేడా కనిపిస్తుంది. మూకీ కాలం పరంగా వెనక్కు వెళ్లిందేమో గానీ ఆదరణ పరంగా వెనక్కు జారలేదు. కొత్తగా వచ్చే ప్రతిదీ అదనపు ఆకర్షణే

## చెవులు రిక్కించి..

ప్రేక్షకుడికి 'ది జాజ్ సింగర్' దృశ్య-శ్రవణానందాల్ని తొలిసారి ఒకేసారి కలిగించింది. 1927లో వచ్చిన ఈ చిత్రంతో సినిమా ముఖచిత్రమే మారిపోయింది. కేవలం రెండే రెండేళ్లలో టాకీలమయమైపోయింది సినిమా. థియేటర్లకు వచ్చే ప్రేక్షకులకు ఈ కొత్తదనం బాగా నచ్చేసింది. పాటకు, సంగీతానికే కాదు డైలాగ్‌కు కూడా ప్రత్యేక విలువనిచ్చాడు ప్రేక్షకుడు. ఇది మాటల రచయితల్ని తయారుచేసింది. పాటల రచయితల స్థాయిని పెంచింది. సంగీత దర్శకులు, గాయకులని తెర వెనుకటి వేల్పులు చేసింది. ఇప్పటి తరానికి ఘంటసాల పేరు గుర్తుందంటే.. కె.వి.మహదేవన్ సంగీతం మిగిలుందంటే.. జానకమ్మ గొంతు వినిపిస్తోందంటే కారణం ప్రేక్షకుడు మంచి శ్రోత కావడమే. డైలాగ్ కింగ్‌లకు, డిఫరెంట్ డిక్షన్‌లకు, పంచ్ డైలాగ్‌లకు, పవర్‌ఫుల్ సంభాషణలకు, భావ కవిత్వానికి, మధురమైన శబ్దాలకి ప్రేక్షకుడు ఫిదా అయిపోయాడు. మైక్‌ల గోల చేశాక సబ్ వూఫర్లు వినిపించాక డాల్బీ సౌండ్ దాటేశాక ఇంకా ఇంకా శబ్దంతో ప్రయోగాలు చేస్తునే ఉంది సినిమా. అభిమాని చెవులు రిక్కించేలా వస్తూనే ఉంది సినిమా. చిత్రంలో ఇదో భళారే విచిత్రం. ఒకప్పుడు 'గ్రేట్ డిప్రెషన్' వల్ల హాలీవుడ్ పరిశ్రమే కనుమరగయ్యే దశకు చేరిందట. అప్పుడు సినిమాలో కొత్తగా చేరిన శబ్దమే దాన్ని నిలబెట్టిందట. హాలీవుడ్‌కు స్వర్ణయుగాన్ని తెచ్చిందట. ఈ శబ్దం-దృశ్యం కలగలసి సినిమాను భారతీయుల జీవితాల్లో భాగం చేసేశాయి. 1950ల నాటికే ఏటా 200 భారతీయ చిత్రాలు విడుదలయ్యాయంటే సినిమా సామాన్యుడికి ఎంత దగ్గరయ్యిందో అర్థం చేసుకోవచ్చు. ప్రేక్షకుడి అనుభూతులు సినిమాతో ముడిపడి కొత్తగా సినిమా భాష వచ్చేసింది. మన మాటల్లో సినిమా పదాలు పదేపదే పడుతుంటాయి. సినిమా అనుభూతి చెందడంలో మన తెలుగువాళ్లు చాలా చాలా ముందు వరసలో ఉంటారేమో. ఎందుకంటే అక్కడి నుంచి చూస్తున్నా కూడా కాగితాలు చించి ఎగరేసి మరీ ఎంజాయ్ చేస్తుంటారు. ఈ మాట ఒక్కసారి చెబితే వందసార్లు చెప్పినట్టే.

కానీ ఆపాతాన్ని అభిమాని మనసు నుంచి దూరం చేసేది కాదు. ఎందుకంటే కొన్నేళ్ల క్రితం మళ్లీ ఓ మూకీ హాలీవుడ్ తెరపైకెక్కి సంచలనం సృష్టించింది. 'ది ఆర్టిస్ట్'గా వచ్చి ఓ ఆస్కార్ అవార్డును అందుకుంది. దానిలో చూపించింది మూకీ మూగ మనసునే. ఓ మూకీ దిగ్గజ నటుడి పరిస్థితి టాకీలొచ్చాక ఎలా మారిపోయిందోననే విషాద చిత్రాన్ని చూపేదే అయినా ఆ మూకీని ఇప్పటి 3డి తరమూ ఆదరించింది. సైలెంట్ సినిమా అంటే మొత్తం శబ్దం మాయమేం కాదు. ఓ మనిషి కథను తెర వెనక నుంచి చెప్పడమో. సంగీతానికి ఓ సెట్ వేసి వినిపించడమో ఏదో ఒక ఏర్పాటు ఉండేది. ముఖ్యంగా జపాన్‌లో ఈ టెక్నిక్ బాగా అభివృద్ధి చెందింది. టాకీలొచ్చినా కూడా అక్కడ మూకీకి మూగ మనసుల ఆరాధన ఉండేది. 'బెన్షీ'గా పిలిచే వ్యాఖ్యాతను సైలెంట్ సినిమా గొప్ప స్టార్‌ను చేసింది. ఎంతోమంది కళాకారులుగా మారారు. ఆ తర్వాత దృశ్యానికి, శబ్దమూ తోడవడంతో మరో శిఖరానికి సినిమా చేరింది. ప్రేక్షకుడి అనుభూతీ మరో విచిత్రాన్ని చూసింది.

### తెరపై హోలీ

ఈస్ట్‌మన్ కలర్‌లోనా కాస్ట్‌లీగా తెర కనిపించడం మొదలైంది. అంతకు ముందే టెక్నీకలర్ రాజ్యమేలింది. మనదేశంలో కలర్ సినిమా 1937లోనే వచ్చింది కానీ, బ్లాక్ అండ్ వైట్‌లో ఏదో ప్రత్యేకత సినీ అభిమానిని కట్టిపడేసి రంగులకు త్వరగా అలవాటు పడేలా చేయలేదు. ఆ తర్వాత మల్టీ కలర్ సాంకేతికత డిజిటల్‌తో సాధ్యమై తెర మీద హోలీ చల్లడం మొదలైంది. కినిమాకలర్, టెక్నీకలర్, ఆగ్ఫా కలర్, ఈస్ట్‌మన్ కలర్, గేవా కలర్ ఏ రంగన్నా సెలుల్యాయిడ్ మీద పడిందంటే చాలు ఇప్పుడు మనం చెప్పుకుంటున్న 3డి సినిమాలా గొప్పగా చెప్పుకునేవారు. సెల్యులాయిడ్ అనే పదానికి మరింత వన్నె తెచ్చిన కలర్ సినిమా దృశ్య సజీవతకు అర్థాన్నిచ్చింది. 2010 వరకు సెల్యులాయిడ్ మీదే చిత్రీకరణ జరిగేది. డిజిటల్ సినిమాటోగ్రఫీ ఒరవడి మొదలయ్యాక సెల్యులాయిడ్ కనుమరగవడం మొదలైంది. పేరుకు ఫిల్మ్ అని సినిమాని చూస్తున్నా అస్సలు పదార్థం మిస్సయ్యింది. టింటింగ్ చేసి చేత్తోనే రంగులద్దిన దశ నుంచి ఇంతకు ముందు మనమెప్పుడూ చూడని ఎన్నో రంగుల్ని ఆవిష్కరించే సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ఈ వర్ణశోభ ప్రేక్షకుడికి కొత్త అనుభూతిని కలిగించింది.

### తళుక్కుమనే సన్నివేశాలు

ఒకప్పుడు కొత్త సినిమా వచ్చిన సందడి వీధుల్లో కనిపించేది గూడు రిక్షాల వల్లే. ఓ మైక్ పెట్టుకుని సినిమాలోని తారాగణం గురించి కథ గురించి రసవత్తరంగా వివరిస్తూ 'నేడే చూడండి' అన్నమాట వినబడిందంటే చాలు పిల్లలకు ఎక్కడలేని ఉత్సాహం తన్నుకొచ్చేది. విసిరే పాంప్లెట్లను గాల్లోనే అందుకుంటూ రిక్షా వెంట పరుగులు తీసేవారు. విదేశాల్లో అయితే 'ఉషర్' అనేవారి పని ఇదే. థియేటర్‌కు జనాల్ని కదిలించేలా పెద్ద గొంతేసుకుని ప్రచారం చేయాలి. అలా థియేటర్‌కు వచ్చేశాక...

పిల్లల్ని నేల క్లాస్‌కు పంపి విరామం వచ్చాక ఖాళీ ఉంటే సీట్లలోకి తెచ్చుకోవడం సాధారణ దృశ్యంగానే ఉండేది. టికెట్ కట్ చేసేవాళ్లకు వీరిని కనిపెట్టుకోవడం అదనపు డ్యూటీ. ఇక గగుర్పొడిచే భయానక దృశ్యమొచ్చే సమయానికే ఎలుక కాళ్ల మీద తచ్చాడుకుంటూ పోవడం.. హాయిగా సినిమా చూస్తుంటే నల్లులు గిల్లడం జరిగిపోతుండేవి. బాల్కనీలో కూర్చుని సినిమా చూస్తున్నామంటే అదో గొప్పగా దర్పం వెళ్లబుచ్చేవారు ఉండేవారు. ఒకప్పుడు తిను బండారాల్ని ఇంట్లో చేసుకుని థియేటర్‌లోకి తీసుకెళ్లేవారు. ఆ తర్వాత అది కూడా వ్యాపారమవడంతో కొన్ని సినిమా బ్రాండ్ చిరు తిండ్లు వచ్చాయి. సమోసా, పాప్‌కార్న్, గోలీ సోడా, జీడి ఉండలు.. ఆ తర్వాత గొట్టాలు, బంగాళ దుంప చిప్స్ అన్నీ కూడా సినిమా తిండిగా మారిపోయాయి. కూల్‌డ్రింక్ సీసాల మీద ఓపెనర్‌ను ఓ తరహాలో తడుముతూ చేసే శబ్దం ఇంటర్వెల్‌లో ఉన్నామన్న హింట్ ఇచ్చేస్తుంది. ఎంత తిన్నా టికెట్ ధరే అప్పుడు సినిమాకు వెలకట్టేది. కానీ ఇప్పుడు మల్టీప్లెక్స్‌ల్లో తిండి ఖర్చే ఎక్కువ. బయటి నుంచి మంచినీళ్ల బాటిళ్లను తీసుకెళ్లడానికి ఇబ్బందే. ఏం తినాలన్నా.. తాగాలన్నా.. లోపలే. ఇదివరకటిలా గేటు బయట చేయి పెట్టి కంకిని అందుకోవడం కష్టం. పల్లి, బఠాణి పొట్లాలు గుప్పిటపట్టడం కనిపించడమే లేదు. ఇక థియేటర్లో పార్కింగ్ కష్టాలు మామూలువి కాదు. టికెట్ కొనేప్పుడు ఎంత ఓపిక ఉండాలో అంతే ఓపిక బండి బయటకు తీయడానికి కావాలి. టికెట్ చించేవాడు తెలిస్తే.. అంతోకొంతో సినిమా పార్ట్‌ను చూసే అవకాశం టికెట్ లేకుండా చిక్కుంచుకునేవాళ్లు కనబడేవాళ్లు. ఓ మూలనో.. కుర్చీల వెనుకో నిలుచుని చూసి ఆనందించేవాళ్లు.

### ల్యాండ్‌మార్క్‌లు

పట్నాల్లో చిరునామా సరిగ్గా తెలియాలంటే.. అక్కడి థియేటర్ పేరు చెబితే సరి. కొన్ని సెంటర్లయితే సినిమా అభిమానుల కేంద్రాలవుతాయి. పక్కపక్కనే థియేటర్ ఉంటే

## మాయా పెట్టెలు

తెర మీద బొమ్మ చూపించడం ఒక్క థియేటర్లలోనే అనుకునే వారికి ఒకప్పుడు తిరునాళ్లలో తిరిగిన అనుభవాలు లేవేమో. 'కాశీ పట్నం చూడర బాబూ..!' అని ఏ గుంపులోంచి మాట బయట పడుతుందా అని శోధించే చిన్నారులు గ్యాంగులు గ్యాంగులుగా తిరిగేవారు. పాట పాడే వ్యక్తికి వాళ్లు ఫ్యాన్స్ అయినా కాకపోయినా అతడి ముందు ఉండే రంగుల డబ్బాకు మాత్రం కచ్చితంగా వీరాభిమానులే. బయోస్కోప్ అనే మాట మీరు తరచూ వింటుంటారు. వీటికి ఉండే అద్దం గుండా లోపలికి చూస్తే 150 ఎంఎం స్క్రీన్ మీద సినిమా కనిపించినట్టు ఫీలవుతాం. కాసింత వెలుతురు కూడా అద్దం గుండా లోపలికి వెళ్లకుండా అర చేతుల్ని తల పక్కన చుట్టేస్తూ అడ్డుపెట్టి కళ్లను రకరకాలుగా సరిచేసుకుని చూస్తుంటే లోపల కాశీ పట్నమేంటి మరెన్నో చిత్ర విచిత్రాలు కనిపిస్తాయి. అవి సాధారణ చిత్రాల్లోని కొన్ని సన్నివేశాలైనా.. జంతువుల కదలికలైనా.. అద్భుతమైన డ్యాన్స్‌లైనా పాటగాడు మరి కాసేపు రాగమందుకుంటే బాగుండనుకుంటూ చూసేస్తారు. కేవలం చిన్నారులేనా పెద్దోళ్లు ఈ షోకు హాజరవ్వాల్సిందే. సినిమా థియేటర్లో అయితే వందమందితో సీట్ షేర్ చేసుకుంటే... ఇక్కడ స్క్రీన్ షేర్ చేసుకునేది ఎంత పెద్ద స్టార్ అయినా కూడా మన ప్రాణ మిత్రులు ఇద్దరు ముగ్గురితో మాత్రమే వేయించుకునే ప్రత్యేక ప్రదర్శన అది. ఆ ముగ్గురికో.. నలుగురికో రీలు తిప్పేసే ఈ మాయా పెట్టెది మామూలు ముస్తాబు కాదు. రంగురంగుల రంగవల్లికలు పెట్టెకు అల్లుకోవాల్సిందే. కొన్ని వస్తువులు మనల్ని జ్ఞాపకాల్లోకి లాక్కెళ్లి పడేస్తాయి. ఈ బయోస్కోప్‌కు కూడా ఆ స్కోప్ బాగా ఉంది. ఇప్పటికీ అక్కడక్కడా వీటిని తిప్పేవాళ్లు కనిపిస్తున్నారు. సూరజ్‌కుండ్ మేళాలో అయితే ఇవే షో స్టీలర్స్. ట్యాబ్‌లకు అతుక్కుపోయే ఈ తరం పిల్లల మనసుల్ని కూడా అవి దోచుకుంటున్నాయి. బంగ్లాదేశ్‌లో అయితే బయోస్కోప్ ప్రభ అంతా ఇంతా కాదు. ఎన్నో తరాలకు ఆనందాల్ని మిగిల్చింది. చిన్నారుల కళ్లల్లో ఎన్నో కాంతుల్ని నింపింది.

## తొలి చిత్రం కార్మికుడిదే..

సినిమాను ప్రపంచానికి అందించారని చెప్పుకునే ల్యూమియర్ బ్రదర్స్‌దే తొలి సినిమాగా గుర్తిస్తారు. 1895లో ఫ్రాన్స్‌లో లియాన్‌లోని తమ ఫ్యాక్టరీ నుంచి బయటకు వస్తున్న కార్మికులను వారు చిత్రీకరించారు. వీరిలో మహిళా కార్మికులే ఎక్కువ. ఈ చిత్రానికి 'లా సోర్టీ డి లా యుసిన్ ల్యూమియర్ అ లియాన్' అనే పేరు పెట్టారు. 46 సెకన్ల పాటు నడిచే ఇదే నిజమైన మోషన్ పిక్చర్ అంటారు. అంతకు ముందే 1888లో లూయిస్ లె ప్రిన్స్ 'రౌండే గార్డెన్ సీన్' వచ్చినా కూడా ల్యూమియర్ బ్రదర్స్ చిత్రానికే గౌరవాన్నిచ్చారు. సినిమాటోగ్రాఫె అనే ఓ ఆల్ ఇన్ వన్ కెమెరా ద్వారా చిత్రీకరించిన ఈ సీన్‌ను అదే ఏడాది డిసెంబర్ 28న ప్యారిస్‌లోని గ్రాండ్ కెఫేలో ప్రదర్శించారు. ఈ కెమెరాకే ప్రొజెక్టర్ కూడా ఉంటుంది. ఈ ఫిల్మ్‌ను 35 ఎంఎం ఫార్మట్‌లో సెకన్‌కు 16 ఫ్రేమ్‌ల వేగంతో దృశ్యీకరించారు.



సిటీలో యువతకు అంతకన్నా మంచి స్పాట్ ఏముంటుంది. కుర్రోళ్లంటే గుర్తొస్తుంది.. కాలేజీకి బంక్ కొట్టి మరీ.. హాస్టల్ గోడ దూకి మరీ.. ఇంట్లో వారికి మస్కా కొట్టి మరీ హాల్ ముందు వాలిపోయే దృశ్యాలు సినిమాల్లోను తీసేశారంటే వాళ్లు నేర్పినట్టా లేదా సమాజం నేర్పింది చూపినట్టా అర్థం కాదు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, హైదరాబాద్ ఏ నగరంలోనైనా సినిమా జంక్షన్‌లు జామైపోతుంటాయి. జాము జాముకి మారే ప్రదర్శనల నుంచి వచ్చే ప్రేక్షకులతో వీధులన్నీ కిక్కిరిసిపోతుంటాయి. అదో వేడుక. అందులో ఓ టికెట్ సంపాదించిన అభిమానిగా అనుభూతి ఓ మంచి జ్ఞాపకం. కటౌట్లు కట్టేశాక, బ్యానర్లు వెలిశాక, టీషర్ట్‌ల మీద బొమ్మ పడ్డాక థియేటర్‌ను కొత్త పెళ్లి కొడుకులా ముస్తాబు చేశాక గానీ ఉద్వేగం సరిగ్గా పక్కనోడికి పంచుకోబడదనే ఉత్సాహం సగటు సినీ పిచ్చోళ్లది. డప్పుల దరువులు.. పటాసుల చప్పుళ్లు.. హాల్ ముందు గెంతులేస్తే... థియేటర్లలో ఈలలు, కేకలు కేరింత కొట్టాలి. అప్పుడే సినిమా చూశామన్న ఫీలింగ్ రాని సైన్మా మనుషులున్నారు. ఇప్పటికీ కొన్ని పాత థియేటర్లను అలానే మెయింటైన్ చేయడానికి కారణం ఈ ఫీలింగ్ మిస్సవ్వకూడదనే.

**మల్టీప్లెక్స్‌ల్లో ఫ్లెక్స్‌అయ్యి..**

అమెరికాలో ఎప్పుడో 1960ల్లోనే మల్టిప్లెక్స్‌లు వచ్చేశాయి. అయితే ఇప్పుడు మనం ఈ మధ్యే చూస్తున్న తరహాని ప్రపంచం మొత్తం చూస్తోంది. మల్టీప్లెక్స్ సంస్కృతి నిన్నామొన్నటి వరకు మెల్లిగానే ప్రపంచమంతా విస్తరించినా ఇప్పుడు మాత్రం ఏ కొత్త నూతనత్వమైనా ఒకేసారి ప్రేక్షకుడి వద్దకు చేరుతోంది. ఇది ఓ రకంగా ఖర్చుతో కూడుకున్నదే అయినా కూడా ప్రేక్షకుడికి ఓ వీలుబాటు దొరికింది. చూడాలనుకున్న చిత్రం కోసం నగరమంతా ఆ థియేటర్ ఈ థియేటర్ చుట్టూ పరుగులు తీసేవారు. ఇప్పుడు ఒకేసారి నాలుగైదు చిత్రాలు ఒకే చోట ఆడటం అభిమానికి ఎక్కడలేని ఉత్సాహాన్నిస్తోంది. ఇది వరకు నేల, బళ్ల, కుర్చీ, బాల్కనీ వంటి తరగతులకు బాగా అలవాటు పడిపోయిన వారికి మల్టీప్లెక్స్‌లు కొత్త రకంగా కనిపిస్తాయి. డబ్బుంటే ప్రేక్షకుడు ఓ రకంగా దర్జాగా సినిమాను ఆస్వాదిస్తాడు. రిక్లైనర్ చైర్‌లు, సోఫాలు, పడుకుని కూడా సినిమా చూసే ఏర్పాట్లు మల్టీప్లెక్స్‌ల్లో ఉంటాయి. నగర యువతకు వీటిల్లో సినిమా చూడటం ఓ క్రేజ్ అయిపోయింది. ఇవి సాధారణంగా షాపింగ్ మాల్స్ భవంతుల్లోనే ఉండటంతో యువతకు అడ్డాలుగా మారిపోయాయి. దృశ్యం, శబ్దం నాణ్యతలో కొన్ని మిగతా థియేటర్లూ వీటికి పోటీనిస్తున్నా మల్టీప్లెక్స్‌లు నూతనత్వా నికి ప్రతీకగా యువత చూడటమే వాటి ఆదర ణకు కారణమేమో. ఇక్కడ బాధాకరమైన విషయ మేమంటే.. దశాబ్దాల నుంచి సినిమాకు కేరాఫ్‌గా నిలిచిన కొన్ని థియేటర్లు కూలిపోవ డమే. వాటి స్థానంలో మల్టీప్లెక్ వెలసి ఆపాతద నం కనుమరుగవు తోంది. ఇందులో మరో చిత్రమేమంటే అక్కడ థియేటర్ బదులు షాపింగ్ కాంప్లెక్స్ మొదలైనా, అపార్ట్‌మెంట్ పడినా ఆ వీధిని, ఆ సందును, ఆ ప్రాంతాన్నే ఆ పాత సినిమా థియేటర్ పేరుతోనే ఇంకా పిలవడం. చిత్రం భళారే విచిత్రం.

ప్రేక్షకుడి అనుభూతి అనేది అనేక హంగుల్ని సినిమాకు ఆపాదిస్తోంది. ఇప్పటికే తెరపై పూలు కనిపిస్తే ఆ సుగంధాల్ని వెదజల్లే ప్రత్యేక ఏర్పాట్లు.. చిత్రంలో వర్షం సన్నివేశం వస్తే ప్రేక్షకుల మీద వాన కురిపించడం.. భూకంపాన్ని తెర మీదే కాక కుర్చీల కుదుపుల్లోను చూపించే ప్రత్యేకతలు సినీ అభిమానుల అనుభూతుల్ని రెట్టింపు చేస్తున్నాయి. మహానగరాలకు వెళితే కచ్చితంగా 5డి, 8ఎక్స్‌డి థియేటర్ల ముందు తచ్చాడే అలవాటు పెరుగుతోంది. కళ్లజోడు పెట్టుకుని 3డి మాయాజాలం లోతుల్లోకి చేర్చే సినిమా వస్తే చాలు ఊహాలోకాల్లో విహారం చేసేద్దామనే ఆరాటం ప్రేక్షకుడిది. 75 ఎంఎంలో చూస్తే అప్పట్లో అదో గొప్ప విషయం.. ఇప్పుడు ఐమ్యాక్స్‌లు ప్రేక్షకుడి అనుభూతిని మ్యాగ్జిమమ్ పెంచేశాయి. ఓపెన్ థియేటర్లు సినిమా అనుభూతిని మరింత ఓపెన్ చేసేశాయి. ఇలా సినిమా అనుభూతులు, అనుభవాలు ఎంతో విస్తరించాయి. తప్పక చూడండి అనే మాట బాగా పాతబడిపోయి.. అస్సలు మిస్సవకూడదనే కొత్త పదం సినీ జనం నోళ్లలో బాగా నానుతోంది. సినిమాలో ఎన్ని దశలు వచ్చినా.. ఎన్ని అనుభూతులు అదనంగా చేరుతున్నా.. అది ఆపాత మధురమైనా.. సై-ఫై భవిష్యత్తు కథ అయినా ప్రేక్షకుడికి ఈ చిత్రమెపుడూ భళారే విచిత్రమే. ఇంట్లో చెప్పకుండా సినిమాకు వెళితే ఒకప్పుడు పెద్ద శిక్ష పడేది. అప్పుడు చేతులు వాచి బాధపడితే... ఇప్పుడదే అందమైన జ్ఞాపకమైంది. సినిమా మనల్ని ఏం చేస్తుందనేది పంచుకునే అనుభవం.. అనుభూతి అయ్యింది. కాదంటారా..! బయోస్కోప్‌ను మీ ముందుపెడితే... అద్దం ముందుకు ఒంగి కళ్లంత చేయకుండా తమాయించుకోగలరంటారా..! సినిమా టికెట్టు చేత పడితే హాల్ ముందు వాలకుండా ఉండగలరంటారా...! చిత్రం భళారే ఈ చిత్రం.

★

## పనోరమా ప్రయాణం

ల్యూమియర్ బ్రదర్స్ ఓ టెక్నిక్‌తో ప్రేక్షకుల చేత ప్రయాణాలు కట్టించారు. రైలు వెనక కెమెరాను ఉంచి చిత్రీకరణ చేసేవారు. దూరంగా ఉండే కొండలు.. వాలుతున్న సూరీడు.. వెంట పరుగు తీస్తున్న రైలు పట్టాలు.. పక్కకు దౌడు తీసే గుర్రాలు.. ఇవన్నీ కూడా రైలు ప్రయాణాలందించే అందమైన దృశ్యాలు. ఈ దృశ్యాలు తెర మీదకు వచ్చేసరికి వీక్షకులు తాము ఏదో ప్రయాణంలో ఉన్నామా అనే భ్రమకు లోనయ్యేవారట. 1900ల్లోనే ఈ టెక్నిక్ వచ్చేసింది. ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన కెమెరాలు మనల్ని సముద్ర అట్టడుగున ఈత కొట్టిస్తున్నాయి. స్కై డైవ్‌లు చేయిస్తున్నాయి. అందివచ్చిన గ్రాఫిక్ మాయాజాలం ఉన్నపాటున రోదసిలోకి నెట్టేస్తోంది. భూమిని, చంద్రుణ్ని వేరే గ్రహం నుంచి వీక్షించే అవకాశం కలిగిస్తోంది.

వింత లోకం

# బాబోయ్ ఇల్లోయ్



మన ఊళ్లో ఊడలమర్రి. రాత్రి దాన్ని దాటాలంటే వణుకు మనోళ్లకు మరీ. రూపం చూస్తేనే బెరుకు పుట్టిస్తుంది. కానీ ఈ ఊళ్లో ఊడలమర్రి కిందన్నా టెంటోసుకు పడుకోవచ్చు కానీ ఈ ఇంటిని దాటలేమని జనం చెబుతున్నారు. బెలారస్ రాజధాని దగ్గరలోని గ్రామం రాతోమ్కాలో ఉండే ఈ ఇంటి నిర్మాణమే భయానకంగా ఉంటుంది. ప్రహరీల మీద భూతాల బొమ్మలు... ఇంటి పెంకులుగా కపాలం ఆకారాలు... గోడ సందుల్లో పొడవాటి చేతుల ఆకృతులు... ఇలా బెలారస్‌లోనే అత్యంత భయంగొలిపే ఇల్లుగా పేరు వచ్చేసింది దీనికి. ఊళ్లోవాళ్లు 'ఇల్లు కట్టించుకున్నోడికి ఇదేం పిచ్చిరా బాబూ!' అని గడగడలాడుతుంటే... సృజన ప్రేమికులు మాత్రం 'వావ్! మంచి టేస్టున్నోడే' అని మెచ్చుకుంటున్నారు. రాత్రుళ్లు ఆ ఇంటిని దాటేందుకు భయపడి ప్రయాణాలు వాయిదాలు వేసుకుంటున్నారట పెద్దోళ్లు. ఆ ఇంటి గోల పడలేక అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. దూరం నుంచి చూస్తే భలే వింతగా అనిపించే ఈ ఇల్లు దగ్గరికెళితే గానీ తెలీదు ఎంత గాబరా పుట్టిస్తుందో. ఈ ఇల్లు కట్టించింది ఓ సాధారణ వ్యాపారి. అయితే, దీన్ని పదేళ్ల కిందటే మొదలుపెట్టాడు కానీ, ఎనిమిదేళ్ల పాటు విరామం తీసుకున్నాడు. మళ్లీ రెండేళ్ల క్రితం ఊరొచ్చి ఇల్లు పూర్తి చేశాడు. మరిన్ని భూతాల బొమ్మలతో ఫినిషింగ్ మిగిలే ఉందట. ఇలా ఎందుకు అని ఎవరో అడిగితే.. దొంగలు గభుక్కున లోనికి రావడానికి భయపడతారని యజమాని చెప్పాడని అంటున్నారు. దొంగలేంటి ఎవరూ ఆ ఇంటి వైపు కన్నెత్తి చూసే ఆలోచన చేయట్లేదిప్పుడు.. ఈ ఇంటి గురించి తెలీక రాత్రుళ్లు ఇక్కడకొచ్చే బయటూరోళ్ల పరిస్థితేంటో.



# బైక్ సంగీత్

రోడ్డు మీద ఒకడు మెలికలు తిప్పుతూ... వేగంగా రెడ్ సిగ్నళ్లను దాటుతూ... సైలెన్సర్ పీకేసి విన్యాసాలు చేస్తూ బైక్ పోనిస్తే... ఈడికిదేం పోగాలమని అని అంతే వేగంగా మాటొచ్చేస్తుంది. అయితే మీకో మాట చెప్పాలి. జపాన్‌లో బోసోజోకు అనే బైక్ గ్యాంగులు గ్యాంగులకిదే పని. ఇలా ట్రాఫిక్ తలనొప్పులే కాదు ప్రమాదాలకు కూడా కారణమవుతుంటాయి. పోలీసులు వెంట పడటంతో హడావిడి తగ్గింది. అయితే, ఇక్కడ ఈ గ్యాంగుల్లోని బైకర్ల సమస్యేమిటంటే స్టంట్ లేకుండా ఖాళీగా ఉండలేరు. ఏదోకటి కిక్కు ఇవ్వాల్సిందే. లేకుండా చప్పగా రోడ్డు మీదకు రాలేరు. అందుకే అడ్డగోలు విన్యాసాలు కాక ఈ మధ్య కాస్త సృజనాత్మకంగా వినూత్నంగా ఆలోచించారు. తమ బండి యాసలరేటర్ శబ్దం, క్లచ్ ప్లేట్ల ధ్వనుల్ని, చైన్ సంగీతాన్ని కలిపి ఓ కొత్త శైలి సంగీతాన్ని మొదలెట్టారు. గ్యాంగ్‌లోని బైకర్లందరూ ఓ చోటకు వచ్చి వివిధ తీరుల్లో తమ బళ్లను వాయిస్తుంటారు. హారన్ సౌండ్ జత కలుస్తుందనుకోండి. హారన్ అంటే గుర్తొచ్చే ఉంటుంది. కొందరు లారీవాలాలు హారన్‌ను భలే తమాషాగా

మోగిస్తుంటారు. మన బస్సుబాబులు ఈ మధ్య మొదలెట్టి శృతి కలుపుతున్నారు. ఈ జాపానీ సంగీతానికి 'బోసోజోకు సౌండ్ బ్యాటిల్' పోటీలు జరుగుతున్నాయి. వీటికి గుంపులు గుంపులుగా ప్రేక్షకులూ హాజరవుతున్నారు. ఇప్పుడు ప్రొఫెషనల్ స్థాయికి వచ్చేసి 40 ఏళ్లు దాటిన వాళ్లూ గ్యాంగ్‌లో చేరిపోతున్నారు. సృజనాత్మకంగా ఆలోచిస్తే మంచి మార్పే వస్తుందేమో.

# హాట్ ఫేవరెట్..!

మంట పుట్టించే మిరపకాయల్ని పరపరా నమిలేస్తుంది సిడ్ బార్బర్. మిర్చిని హాంఫట్‌లాడించే విషయంలో ఆమెను ఎవరూ ఓడించలేక నీళ్లు మింగేస్తున్నారు. క్లిఫ్టన్ చిల్లీ ఈటింగ్ క్లబ్ పేరిట ప్రతి ఏటా జరిగే పోటీల్లో పాల్గొంటున్న సిడ్ 2014 నుంచి వేడి హవా పుట్టిస్తోంది. ఈ పోటీల్లో రౌండ్ రౌండ్‌కు సెగ పెరిగిపోతుంది. తొలుత మనమూ సాధారణంగా చప్పరించేసే జలాపెనో పచ్చి మిరపలుంటాయి. ఆ తర్వాత రెడ్ ఫ్రెస్నోలు అలా అలా ఘోస్ట్ చిల్లీల వరకు మంట పెట్టేస్తారు. ఇక నాగా వైపర్ల వంతు వచ్చేసరికి సిడ్ కూడా ఉఫ్ ఉఫ్‌మనటం మొదలెడుతుంది కానీ టేబుల్ ముందు నుంచి లేవదు. మిగతా పోటీదారులు మాత్రం నోరార్చుకుంటూ పక్కకు తప్పుకోవడం

మొదలపెడతారు. పది లక్షల స్కోవిల్లే యూనిట్ల స్థాయిలో మంట పుట్టిస్తాయి మరి నాగా వైపర్ మిరపకాయలు. ఇక చివరిగా 15 లక్షల స్కోవిల్లే యూనిట్ల స్థాయిలో ఉండే కెరోలినా రీపర్ మిరపల ప్లేట్ ముందు పెడతారు. ఇవి తింటే మనమూ డ్రాగన్లలా మంట వదులుతున్నా మన్నంత మంట పుడుతుంది. ఈ రౌండ్‌కు మిగిలేది ఇద్దరే ఇద్దరూ. వారిలో నాలుగేళ్లుగా సిడ్ ఉంటోంది. మిగతా వ్యక్తి ఏటా మారిపోతున్నారు. ఇక్కడే అర్థం చేసుకోవచ్చు సిడ్‌కు మిరప ఘాటు ఎంతిష్టమో. కన్నీళ్లొస్తున్నా... నీళ్లు గానీ పాలు గానీ తీసుకునే అవకాశం లేకున్నా కూడా ఆమె వాటిని తినడం ఆపదు. ఇంకేముంది పక్క వ్యక్తి చేతులెత్తేయడం... సిడ్ గెలిచేయడం సాధారణ దృశ్యం. ఇంత మంట తట్టుకుని గెలిస్తే ఏమొస్తుందంటే సరదాగా ఓ నాలుగు వేల రూపాయల వరకు ఇస్తారు. ఇక్కడ ప్రైజ్‌మనీ కన్నా ఈ పోటీల్లో పాల్గొని గెలిచేవారిని అక్కడో హాట్ హాట్ సెలెబ్రెటీలా చూస్తారు. అందుకే వచ్చే ఏడాదికి సిడ్ హాట్ ఫేవరెట్ అయిపోయింది.

తెలుసా

# చదివేయండి..!

- గ్రంథాలయాల్లో పుస్తకాలు తరచుగా దొంగిలించబడుతుండడంతో దాన్ని నిరోధించేందుకు పుస్తకాలని వుంచిన డెస్కులు, షెల్ఫ్‌లని గొలుసులతో బంధించేవారు.
- ఎక్కువగా పుస్తకాలు చదవడం ద్వారా 66శాతం వత్తిడిని తగ్గించుకోవచ్చు.



- పుస్తక పఠనం ద్వారా క్లిష్టమైన పరిష్కరించే ఆలోచనలని చేయగలగడం, మంచి గ్రహణ శక్తితో పాటు మంచి రచయితలుగా మారతారనేది ఒక సర్వే నివేదిక.
- మహిళ అర్ధ నగ్న ఛాయాచిత్రాన్ని పుస్తకం అట్టపై ప్రచురించడంతో వాట్డొ పుస్తకం అమెరికాలో నిషేధించబడింది.
- మధ్య యుగం నాటి నుండే పబ్లిక్ లైబ్రరీలు అందుబాటులోకి వచ్చాయి.
- హార్వర్డ్ విశ్వవిద్యాలయం లైబ్రరీలో మానవ చర్మంతో బౌండ్‌చేయబడిన నాలుగు పుస్తకాలని ఇప్పటికీ మనం చూడొచ్చు.



- పుస్తకం తయారీ తొలినాళ్ళలో కవర్ పేజీలకు దూడ చర్మాన్ని ఉపయోగించేవారు.
- కలపతో చేసిన పుస్తకపు అట్టలపై పైతొడుగులు తోలుతో తయారుచేయబడేవి.
- పుస్తకాల ముద్రణలో తొలి నాళ్ళలో ఉపయోగించింది టోనర్‌నే.
- ప్రస్తుత యాంత్రిక జీవనంలో సామాజిక మాధ్యమాల్లో తలమునకలవుతున్న యువతలో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచడంతోపాటు ఓ రోజు మొత్తం పుస్తకాలు చదువుతూ ఆనందంగా గడిపేందుకు సెప్టెంబర్ 6ను నేషనల్ రీడ్ ఎ బుక్ డేని జరుపుకుంటున్నారు.





- 'లార్డ్ ఆఫ్ ది రింగ్స్' రచయిత జె.ఆర్.ఆర్ టాల్కెయిన్ కేవలం రెండు వేళ్లని ఉపయోగించి పుస్తకం టైపింగ్‌ని పూర్తిచేశాడు.
- ప్రతిరోజు 20 నిమిషాలు కొత్త పుస్తకాలని చదవడం ద్వారా పిల్లలు సంవత్సరానికి 1.8 బిలియన్ పదాల్లో పడతారని ఒక అధ్యయనం.
- ప్రతి పదిమందిలో ముగ్గురు మాత్రమే అచ్చయిన పుస్తకాలని చదువుతున్నారనేది ఓ నివేదిక.

# సరదా



యన్.టి.రామారావు కెరీర్‌లో దాదాపు డెబ్భైశాతం అందరూ కొత్త ప్రొడ్యూసర్లే. కొత్త వారు రావాలి. నిలబడాలి అప్పుడే పరిశ్రమ పచ్చగా వుంటుంది. కొత్తవాళ్ళకి ఆవేశం వుంటుంది. అనుకున్నది సాధించాలనే పట్టుదల వుంటుంది. ఓ క్లారిటీ వుంటుందని భావించి.. తాపీ చాణక్యని దర్శకుడిగా ఎంపిక చేశారు. చాణక్య తాపీ ధర్మారావుగారి కొడుకు. ధర్మారావుగారు గొప్ప కవి. మేధావి, చేయితిరిగిన రచయిత. తనూ మేధావి కాకుండా పోతాడా.. అది రామారావుగారి నమ్మకం. ఆయన నమ్మకం వమ్ముకాలేదు. ఇక ఈ చిత్రానికి నిర్మాత రామానాయుడు. రామానాయుడు యువకుడు. పైగా అందగాడు. అందర్నీ ఎంతో గౌరవించేవారు. ఈ అబ్బాయికి హీరో కావలసిన లక్షణాలున్నాయని ముచ్చట పడేవారు. అలానే కొందరు హీరోగా ప్రయత్నించమని అడిగేసేవారు కూడా. అందుకు ఆయన నవ్వుతూ 'నేను వ్యాపారం చేయడానికి వచ్చాను. అందుకు సహకరించండి. నటుడ్నయితే నేనొక్కడ్నే బతుకుతాను. అదే నిర్మాతనయ్యి పది సినిమాలు తీస్తే వందమంది బతుకుతారు' అనేవాడు. అప్పట్లో మంచి డిమాండ్ వున్న నటీనటులు ఎస్వీఆర్, జమున, యన్.విజయచిత్ర, రాజనాల, రేలంగి, గిరిజలు. వీరంతా మొదటి సినిమా కదా అని రామానాయుడ్ని ప్రోత్సహించడం కోసం ఒప్పుకున్నారు.

### కథా కమామీషు

'రాముడు-భీముడు' చిత్ర కథ నరసరాజుగారు చాలా కష్టపడ్డారు. రాముడు- భీముడు రెండు పాత్రలను సృష్టించి వారి వ్యక్తిత్వాల మధ్య వైవిధ్యం చొప్పించి ముందుగా ఒకడు రాముడుగా మరొకరు భీముడుగా ఎస్టాబ్లిష్ చేశాడు. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన అమాయకుడైన రాముడు అక్కా బావల దగ్గర పెరగడం, బావ చెప్పుచేతుల్లో నడుచుకోవడం చేస్తుంటాడు. భీముడు రాటుదేలిన వాడు. రంగస్థలం మీద ఏ పాత్రనైనా అవలీలగా పోషించగల సమర్థుడు. తిండిపుష్టి, కండపుష్టివున్నవాడు. ఆయనతల్లి అమాయకురాలు. మరో పాత్ర... యల్ విజయలక్ష్మి. నాయనమ్మ పెంపకంలో పెరుగుతుంది. ఆ నాయనమ్మకి మతి భ్రమించి వుంటుంది. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నా...అర్థవంతమైన సంభాషణలు పలుకుతుంది. ఇక జమీందారు దగ్గర బంధువు...అతడూ సంపన్నుడే...ఆయన ఒక్కగానొక్క కూతురు జమున అల్లారుముద్దుగా, పెరుగుతుంది. తన తాహేతకు తగ్గ జమీందారు కొడుకునే అల్లుడిగా చేసుకోవాలని ఆశపడుతుంటాడు యస్వీఆర్. ఇదీ మూడు కుటుంబాల నేపథ్యం. జమీందారు దగ్గర గుమస్తా రమణారెడ్డి. ఆయన కూతురు గిరిజ. చలాకీ అమ్మాయి. వట్టి మాటలతో పొట్టపోసుకునే ఘటం రేలంగి. గిరిజ రేలంగిల మధ్య ప్రేమ... మామ రమణారెడ్డి తిరస్కరణ...ఇలాంటివన్నీ మనకి కథలో కనిపించే అంశాలు. చాలా అందంగా స్క్రీన్‌ప్లే ముందుగా సమకూర్చుకుని చుక్కల ముగ్గు కలిపి అందమైన రంగవల్లిగా తీర్చిదిద్దినట్లు ఈ పాత్రలన్నిటినీ జనరంజకంగా నడిపిస్తూ చివరికి అందమైన ముగింపునిచ్చి ప్రేక్షకుకుల్ని తెర ముందు కట్టిపడేసేలా చేశారు. రచయిత డి.వి. నరసరాజు ఎక్కడా ఒక్క సన్నివేశం కూడా బోరుకొట్టకుండా కథా కథనాల విషయంలో తాపీ చాణక్య ప్రదర్శించిన చతురత అద్భుతం! అనిర్వచనీయం!.

### పాటలకు ప్రాణం పోశారు

పెండ్యాల నాగేశ్వరరావు రంగస్థల నుంచి వచ్చిన వారు గనుక సందర్భశుద్ధి బాగా తెలుసు. పాటల్ని సిట్యుయేషన్ డిమాండ్‌ని బట్టి పొదగబడ్డవే. సహజంగా సంగీత ప్రేమికుడు పెండ్యాల. ఒక కొత్త నిర్మాత చిత్రానికి వందశాతం న్యాయం చేయాలని తపనతో చేసిన సంగీతం! హైలెట్. డా.సి.నారాయణ రెడ్డి విరచితమైన 'తెలిసిందిలే...తెలిసిందిలే.... నెలరాజ నీ రూపు తెలిసిందిలే! పాట..అమృతతుల్యం. ఘంటసాల సుశీల గానం చేశారు. యన్టీఆర్ జమునల మీద చిత్రీకరించారు. ఆపాత మధురమైన ఈ పాట 'అదే..అదే..అదే నాకు అంతు తెలియకున్నది...ఏదోలాగ మనసులాగుతున్నది' ఈ పాటని కూడా ఘంటసాల సుశీల గానం చేశారు. ఈ పాటని జమున యన్టీఆర్‌ల మీద చిత్రీకరించారు, ఈ రెండు పాటల్లోనూ వాళ్ళిద్దరూ చాలా రొమ్యాంటిక్‌గా నటించారు ఈ పాటలు యువతరానికి బాగాకనెక్ట్ అయ్యాయి. 'రాముడు - భీముడు' లాంటి కుటుంబకథా చిత్రాల్లో ప్రబోధ గీతాలు కూడా అతికినట్లు సరిపోవడం దర్శకుడి ప్రతిభకి తార్కాణం. అందులో మొదటి గీతం 'వుందిలే మంచి కాలం ముందుముందునా.... అందరూ సుఖపడాలి నందనందనా' శ్రీ శ్రీ రాసిన ఈ పాటని ఘంటసాల సుశీల గానం చేశారు. ప్రతి మనిషికీ మంచి కాలం ముందుంటుంది. ఈ నాటికీ చాలామంది సెల్ రింగ్‌టోన్‌గా ఈ పాటని వాడుతున్నారంటే ఎంత గొప్ప స్ఫూర్తినిస్తుందో అర్థంచేసుకోవచ్చు. నటరత్న యన్.టి.ఆర్. తీరిక సమయాల్లో ఈ పట పల్లవిని కూనిరాగం తీస్తూ వుంటారంటే ఆశ్చర్యం కలగక మానదు. ఇది నిజం. మరోపాట కొసరాజు రాసిన పాట. ఇదీ ప్రభోద గీతమే. 'దేవమ్ము మారిందోయ్.... కాలమ్ముమారిందోయ్... కష్టాలు తీరేనోయ్ సుఖాలు

# ... సరదా సూపర్ హిట్లు

మంచి సినిమాలకు మాత్రం నెలవుగా వున్న రోజులవి. కథల విషయంలో చాలా శ్రద్ధ చూపించేవారు. ఏ కథనీ పూర్తి సంతృప్తికరంగా ంతవరకు ఒప్పుకునే వారుకాదు. డి.వి.నరసరాజుగారు ఓ కథ రాశారు. ముందు నాగిరెడ్డి, చక్రపాణిగార్లకు వినిపించారు. చక్రపాణిగారు వివిరిచేశారు. ఆ తరువాత ఇద్దరు ముగ్గురు ప్రొడ్యూసర్లకి కథ వినిపించారు. వారు 'కథ వినడానికి బాగానే వుంది కానీ ్విపాత్రాభినయం అంటున్నారు ఒకడు అమాయకుడు ఒకడు గడుసువాడంటున్నారు చిన్నప్పుడు విడిపోయి మళ్ళీ కలుస్తారంటున్నారు ఇంత కన్ఫ్యూజన్ వుంటే సినిమాని ప్రేక్షకులు చూస్తారా?' అంటూ నిరాశపరిచారు. నరసరాజుగారి గురించి రెండు మాటలు చెప్పాలి. ంతసేపు గొప్ప సాహిత్యం చదవడం... కథలు రాసుకోవడంలో నిమగ్నమయ్యేవాడు. తనకు తృప్తికరంగా అనిపిస్తేగానీ మరొకరికి కథ చెప్పేవారుకారు. ఓ డిగ్నిటీవున్న రచయిత. సమయపాలన పాటించడంలో ముందుంటాడు. కథ వినిపించారు రాజుగారు. ఆయనకి కథ ాగా నచ్చేసింది. వెంటనే సురేష్ ప్రొడక్షన్స్ బ్యానరు మీద చిత్రం మొదలైంది ఆ చిత్రం పేరే 'రాముడు -భీముడు'.

పండేనోయ్...' ఘంటసాల సుశీల గానం చేయగా యన్టిఆర్ ఎల్. విజయలక్ష్మిల మీద చిత్రీకరించారు. ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఏమిటంటే ఇటువంటి పాత్రలు కథకి ప్రాణం పోస్తాయి. పదిపదుల కాలాలు ఆదర్శవంతంగా నిలుస్తాయి. చివరికి సరదాపాటలో కూడా సందేశాన్ని మిస్సవ్వలేదు కొసరాజుగారు.

ఆ పాటే సరదా సరదా సిగరెట్టూ...ఇది దొరలు తాగు భలె సిగిరెట్టు...' అంటూ రేలంగి గిరిజల మీద చిత్రీకరించిన పాట అప్పుడప్పుడే చుట్టలు విడిచిపెట్టి దొరలు సిగరెట్లు మొదలు పెట్టిన సమయం. కాలమాన పరిస్థితులని బట్టి ఈ పాటలన్నీ రాముడు–భీముడు సినిమాకి ప్రాణం పోశాయి.

**సంక్షిప్తంగా కథ**

చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన అమాయకుడైన రాముడు అక్క బావలు... శాంతకుమారి రాజనాల నీడలో పెరుగుతాడు. శాంత కుమారికో బిడ్డ. ఆ బిడ్డంటే రాముడికి పంచప్రాణాలు. బావ చెప్పింది చెయ్యకపోతే రాముడ్ని చావగొడుతుంటాడు. ఈ బాధలు భరించలేక రాముడు ఇల్లు వదిలి పారిపోతాడు. భీముడు రాముడి స్థానంలోకి ...'రాముడు భీముడి' స్థానంలోకి మారతారు. రాముడి రూపంలో వున్న భీముడు అక్క ఇంటి పరిస్థితులు చక్కబెట్టి బావకి గుణపాఠం చెబుతాడు. స్వచ్ఛమైన ప్రేమనిపంచే పల్లె జనాల మధ్య భీముడు రూపంలో వున్న రాము డు... తనూ చైతన్యవం తుడై పల్లె ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తాడు. రాము డనుకుని భీముడిని ప్రేమించిన జమున, భీముడనుకుని రాముడిని ప్రేమించిన యన్. విజయలక్ష్మి అంతా ఒక కుటుంబం అని బామ్మ ద్వారా తెలుసుకుంటారు. గోదావరి పుష్కరాల్లో తప్పిపోయిన రాముడు - భీముడు వీరే అని తనదగ్గర వున్న గుర్తులు చూపించి కథని సుఖాంతం చేస్తుంది బామ్మ! ఎక్కడా ఏ విధమైన కన్ఫ్యూజన్ లేకుండా తన ప్రతిభని కనబరిచాడు తాపీ చాణక్యం.

**చిత్రం ప్రత్యేకతలు**

మొట్ట మొదటిసారి యన్టిఆర్ ద్విపాత్రాభినయం చేసిన చిత్రం. నాగార్జున సాగర్ నిర్మాణంలో వుంటుండగా సాగర్‌లో యన్.టి.ఆర్ ఎల్. విజయలక్ష్మి మిగతా నటీనట సిబ్బందితో ...ఒక పక్క సాగర్ పనులు జరుగుతుండగా మరో పక్క షూటింగు జరుపుకున్న చిత్రం. ఆ సన్నివేశాలన్నీ సహజంగా కనిపిస్తాయి. అంత మంది జూనియర్ ఆర్టిస్టులని పెట్టి ఈ రోజుల్లో తీసినా అంత పరిపూర్ణత రాదు సినిమాలకి. ఇదే సినిమా తమిళంలో ఎం.జి.ఆర్‌తోనూ హిందీలో దిలీప్ కుమార్ తోనూ విజయ ఢంకా మోగించారు. కొంచెం కథలో...హీరో హీరోయిన్ పాత్రల్ని మార్చి 'సీతా ఔర్ గీతా' తీశారు. ఇదే కథావస్తువుతో తెలుగులో 'గంగ మంగ' చిత్రాన్ని తీశారు. అలాగే కథలో లైను తీసుకొని 'శ్రీరామరక్ష' ఏఎన్ఆర్ ద్విపాత్రాభినయంలో సినిమా తీశారు. ఇదొక సక్సెస్‌ఫుల్ ఫార్ములా ...రాముడు భీముడు చిత్రంలోని పాత్రలన్నీ సజీవంగా వుంటాయి. 'బుల్లోడు బుల్లెమ్మ' చిత్రంలోనూ కొంతవరకు భీముడి పాత్రని ఇంప్లిమెంట్ చేశారు. ఇక్కడ మనం ప్రత్యేకించి చెప్పుకోవలసిందేమిటంటే ఇప్పటికీ పండగలకీ పబ్బాలకీ ఈ సినిమాని పల్లెల్లోనే కాదు పట్టణాల్లో టీవీలో విపరీతంగా చూస్తుంటారు. ఆపాత మధురాలనదగ్గ పాటలు ఎవరు పాడినా అందులో 'రాముడు భీముడు' చిత్రంలోని పాటలకి చోటుంటుంది.

**నటీనటుల స్పందన**

యన్.టి.ఆర్ జమున, యస్వీరంగారావు, రాజనాల, యన్. విజయలక్ష్మి, గిరిజ, రేలంగి అందించిన సహకారం మరచిపోలేను అంటుండే వాడు రామానాయుడు. తదుపరి శతాధిక చిత్రాల్నీ తీయగలిగానంటే అగ్రనటీనటులంతా పెద్ద మనసు చేసుకొని నన్ను ఆదరించబట్టే అంత గట్టి పునాది వేయబట్టే అన్ని చిత్రాలు చేయగలిగాను అంటారు. తను బతికున్నంత కాలం ఆ యా నటీనటుల పట్ల అంతే కృతజ్ఞతాభావంతో వుండేవారు. ఇక నటీనటుల విషయానికొస్తే జమున మాట్లాడుతూ' పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. రామానాయుడిగారు తన తొలి చిత్రంలోనే తన దీక్షాదక్షతలను నిరూపించుకున్నారు!' అంటూ రామానాయుడు శతాధిక చిత్రాల సన్మానసభలో ప్రశంసించింది.

**- ఇమంది రామారావు**

**9010133844**

# నరుడా ఏమి నీ కోరిక

మద్యం మత్తులో
మతం మత్తు పోటీ పడలేక
ద్వితీయ స్థానానికి దిగింది
మతం మత్తునే
జయించిన మద్యం మత్తు
ప్రథమ స్థానం జారకుండా
మనిషి వరాహమూర్తై
మద్యం గోళాన్ని మోస్తున్నాడు!
భర్తలు తాగుతున్నారు
భార్యలు ప్రతి ఘటిస్తున్నారు
మద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం
రాతకందని ప్రక్రియలో అభినయించాల్సి వుంది
ధ్యానానుకరణ చెయ్యాల్సి వుంది!
రిజర్వాయరు నీటిలా
మద్యాన్ని విడుదల చేస్తూ
ప్రభుత్వ వామహస్తం
ఆదాయ హుండీని లెక్కిస్తూ
దక్షిణ వామహస్తం!
అతడు తాగేసిన సీసాల్ని
లెక్కించాను
ఐదెకరాల మాగాణి
ఆడు మాన్యంలో వుంది
అతడి కైపు సాంద్రతను
కొలిచాను
పెళ్ళాం పుస్తె తాకట్టు కెళ్ళింది
అతడి బాధ్యతలు గుర్తించాను
బడిమాని బిడ్డలు
బికారులయ్యారు
అతడి ఆరోగ్యాన్ని
బేరీజు వేశాను
ఆరోగ్య శ్రీ త్రాసులో
తరకలా తూగుతోంది
కావేవీ తాగుడుకు అనర్హం
సినిమా హాళ్ళు హోటళ్ళు
బట్టీలు పార్కులు
రహదార్లు విద్యాలయాలు
ఇళ్ళు ఆశ్రమాలు!
మల్లమ్మ పతిభక్తి
మగాళ్ళని రక్షిస్తుంది
మగువ మంచాల
త్యాగ నిరతి విస్తరిస్తుంది!
ఒక దీపం వంద దీపాల్ని వెలిగిస్తుంది.
ఒక గుండె వేయి గుండెల్ని రగిలిస్తుంది!
ఒక్క నినాదం లక్షగొంతుల్లో ఎలుగెత్తుతుంది
గుడిలోంచి వస్తున్న అతణ్ణి
మిత్రుడు అడిగాడు
"దేవుణ్ణి ఏం కోరుకున్నావని"
తాక్కుండా మా నాన్న
కూలి డబ్బులు ఇంటికి తేవాలని

- అడిగోపుల వెంకటరత్నం
9848252948

# అంతర్యుద్ధం



కవిత్వం

అంతర్యుద్ధం మాహిష్మతికి మంచిది కాదేమో
నీకు నాకు మాత్రం కచ్చితంగా అవసరం
ఎన్ని అబద్ధాలతో అలంకరించుకున్న జీవితమైనా
ఎక్కడో చోట నగ్నంగా కనిపిస్తుంది
జీవితమో అద్భుతం.. అజ్ఞాత భయమంటూ
ఎన్నాళ్ళిలా చితిలేని గోరీ చుట్టు కేరింతలు కొడుతూ
మరణ పరిమళాల్ని శ్వాసిస్తావ్..?
అసత్యంలో సత్యం
దు:ఖంలో సుఖం
చావులో జీవితం
అన్నీ బ్రతుకు మీద ప్రేమతో చావుకు తెగించినపుడు
ఒకానొక అనుభవం మనల్ని ముక్కలు ముక్కలుగా చేస్తుంది...
అప్పుడు నీ మనస్సు..
గాయపొడ్డ వీరుని వలె మూల్గుతుంది..
నిరంతరం పురిటినొప్పుల వలె
పెనుగులాడే నీ మనస్సుకి
ఏ మంత్రసానొచ్చి పురుడు పోస్తుంది...?
అహర్నిశలూ నువ్వే పాడుకోవాలి ఓ వీడుకోలు పాట
ఈ పాటెప్పుడు ముగియదు
ఒకానొక చరణమెప్పటికీ మిగిలే ఉంటుంది...!!

- ఇ రామకృష్ణ
9985403678

# పోపుల పెట్టె

- ఈదర శ్రీనివాస్
7893111985

కథ

ప్రతి రోజూ ఉదయం తూరుపు కొండలపై నుంచి సూర్యారావు నా గదిలోకి జొరబడక మునుపే నిద్రలేచి, మార్నింగ్ వాక్‌లో మా కాలనీలోని నాలుగు వీధులు చుట్టేసి, కనబడిన వాళ్ళకు శుభోదయ శుభాకాంక్షలు (అదేనండి 'గుడ్‌మార్నింగ్') చెప్పందే నాకు దినచర్య ప్రారంభం కాదు. తెలతెలవారుతుండగా, చీకట్లింకా పారిపోకముందే స్వచ్ఛమైన గాలి పీలుస్తూ, పక్షులు పాడే ఉదయరాగాలు వింటూ, మంచు బిందువుల గుండా సూర్యకిరణాలు వెదజల్లే ఇంద్రధనస్సులను చూస్తూ మార్నింగ్‌వాక్ చెయ్యటం మనసుకు ఎంత హాయిగా వుంటుందో అది అనుభవించిన వారికే తెలుస్తుంది.

నేటి కాంక్రీటు జనారణ్యాల్లో పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి, పక్షుల కిలకిలరావాలు.. ఇవన్నీ ఈ రోజుల్లో ఎక్కడున్నాయి. సినిమాలోని కథానాయకుడి పల్లెటూరి వాతావరణం గురించి చెప్తన్నాననుకునేరు. నిజంగానే పేరుకు తగ్గట్టే మా 'బృందావనం కాలనీ'లో ఇంట్లో పచ్చని చెట్లు కాలనీ మధ్యలో సీతారాముల గుడి, దాని పక్కనే చెరువు నిజంగానే 'పట్నంలో పల్లెలా' వుంటుంది. దీనికి కారణం మా కాలనీవాసులందరూ ఒక మాటపై వుండి పరిశుభ్రతకు పెద్దపీట వెయ్యటమే. కాలనీ అభివృద్ధి కమిటీ కూడా ప్రతిరోజు కాలనీ శుభ్రతను సమీక్షిస్తుంది. కమిటీలో నేను సభ్యుడినే కాబట్టి, మార్నింగ్‌వాక్ చేస్తూ కాలనీ వీధుల్లో పరిశుభ్రతను పరిశీలించటం అలవాటయిపోయింది. ఎక్కడన్నా చెత్త పేరుకుపోతే వెంటనే వాటిని శుభ్రం చేయించకుండా ఆ రోజు ఇంటికి తిరిగిరాను. ఆ రోజు కూడా యధావిధిగా వాకింగ్ పూర్తి చేసుకుని మా వీధిలోకొస్తూ ఒకసారి మా వీధి చెత్తకుండీ వైపు దృష్టి సారించా. చెత్తకుండీలో చెత్తా చెదారాల మధ్య ఒక వస్తువు నా దృష్టినాకర్షించింది. చీకట్లు పూర్తిగా తొలగిపోకపోవటంతో ఆ వస్తువు కనపడీ కనపడనట్లుంది. ఎక్కడో చూసిన జ్ఞాపకం మెదడు పొరల్లో నుంచి బయటకు రాలేకపోతోంది.

దగ్గరకు పోయి చూద్దును కదా, అది మా అమ్మ వాడే 'పోపుల పెట్టె'. ఒక్కసారిగా నా గుండెలను ఎవరో పిండేస్తున్నంత బాధ కలిగింది. నాన్న పోయిన దగ్గర్నుంచి ఆయన మీద దిగులుతో ఏడాది తిరగకుండానే అమ్మ కూడా కాలం చేసింది. వాళ్ళతోపాటే వాళ్ళ తీపి గుర్తులు కూడా చెరిగిపోకుండా, వాళ్ళు వాడిన వస్తువులు భద్రంగా దాచుకున్నా. నాన్న కళ్ళజోడు, చేతికర్ర, ఆయన వాడిన సిరాపెన్ను, పడక కుర్చీ, అమ్మ వాడిన పూజాసామగ్రి వంటి వస్తువులన్నిటిని ఎంతో అపురూపంగా నా గదిలో అమర్చుకున్నా. రోజుకు ఒక్కసారన్నా వాటిని తడిమి చూడకుండా నా కే పని చేయబుద్ధికాదు.

మా పిల్లలకు, మా ఆవిడకు ఇదంతా వట్టి ఛాదస్తంలా, నాన్‌సెన్స్‌లా కనపడేది. మా పిల్లలైతే నా గది బయట 'డాడీస్ మ్యూజియం' అని బోర్డు తగిలించి ఆటపట్టిస్తూ వుంటారు. మా ఆవిడకు కూడా ఈ పాత చింతకాయ పచ్చడి లాంటి వస్తువులన్ని బయట పారేసి కొత్త మాగాయలాంటి అధునాతన సామాగ్రితో ఇల్లంతా అలంకరించుకోవాలని కోరిక. కానీ నాకు భయపడో, లేక నా మీద జాలిపడో తను ఎప్పుడు ఆ విషయం నేరుగా నాతో చెప్పేది కాదు అప్పుడప్పుడు ఎవరింటికన్నా వెళ్ళినప్పుడు, వాళ్ళింట్లోని ఆధునాతన సోఫాసెట్లు, అలంకరణ సామగ్రి చూసినప్పుడు మాత్రం మాటల్లో కాస్త బయట పడేది దేనికైనా రాసి పెట్టి వుండాలని' ఒక నిట్టూర్పు విడిచేది. దాని అంతరార్థం నాకు తెలిసి చిన్న చిరునవ్వుతో తనని మళ్ళీ నా దారిలోకి తీసుకొచ్చే వాడ్ని. కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, అమెరికా ఉద్యోగాలు అనే ఆలోచనలతో పరిగెత్తే యువతరానికి బంధాలు అనుబంధాల గురించి ఒక్క క్షణం ఆలోచించే తీరిక లేక పోవడం చాలా బాధాకరం. నేటి తరానికి తాతయ్యలు చెప్పే కథలు, నాయనమ్మలు తినిపించే గోరుముద్దలు, అమ్మమ్మలు చేసే సున్నుండలు, బాబాయిలు, మేనమామలు వేసే సెటైర్లు, అత్తమ్మలు చెప్పే కబుర్లు ఇవేవి లభించకపోవటం వాళ్ళు చేసుకున్న దురదృష్టం. నాకిప్పటికీ గుర్తు మా నాయనమ్మ, మా తాతయ్యకు తెలియకుండా అర్ధ, బేడా వంట గదిలోని పోపుల పెట్టెలో దాచేది.

పోపుల పెట్టె అంటే ఏమిటి? ఈ తరానికి తెలియదనుకుంటా, కూరల్లో తిరగమూత పెట్టటానికి కావల్సిన ఆవాలు, వెల్లుల్లి, ఎండుమిర్చి వంటి దినుసులు పెట్టుకునే పెట్టెను 'పోపులపెట్టె' అంటారు. అందులో డబ్బు దాచుకుంటే ఎవ్వరికి తెలియదని ఓపిచ్చి నమ్మకం, కాని మాతాతయ్య, మాఅమ్మమ్మకు తెలియకుండా డబ్బులు కొట్టేసి చుట్టలు తాగేవాడు. పోపులపెట్టెలో డబ్బులుండాలి ఎమైనాయి చెప్మా అని ఆశ్చర్యపోవటం ఆవిడ వంతయ్యేది. పిచ్చిరోజులు, పిచ్చి మనుషులనుకుంటాం కాని మంచి మనసులు అని తెలుసుకోలేకపోతున్నాం. మేం చిన్న పిల్లలుగా వున్నప్పుడు వీధిలోపోతున్న ఐస్‌పుల్ల కోసమో, సోంపాపిడి కోసమో మారాం చేస్తుంటే, నాయనమ్మ దగ్గరకు పిలిచి పోపులపెట్టెలో నుంచి

తీసి పావలా, అర్ధ ఇచ్చేది. ఆ నిమిషంలో మాకు ఆమే అపర లచ్చిందేవిలా కనపడేది. 'పోపులపెట్టె' అయితే మాకు మా ఇంటి లక్ష్మిదేవి ఇనప్పెట్టె లా కనపడేది. దాన్ని మేం ఎంతో అపురూపంగా చూసేవాళ్ళం. మా నాయనమ్మ పోతూ పోతూ మా అమ్మకు వారసత్వం కింద ఆమె నగలతో పాటు పోపులపెట్టె కూడా ఇచ్చి వెళ్ళింది. మా అమ్మ హయాం వచ్చే సరికి, మా అమ్మకు పోపులపెట్టెలో డబ్బులు దాచాల్సిన అవసరం రాలేదు. మా నాన్న గారు అమ్మకు స్వేచ్ఛని ఇచ్చేవారు. నెల జీతం మొత్తం అమ్మ చేతికే ఇచ్చి ఖర్చు చేయమనేవారు. దీంతో పోపులపెట్టె వంటింటి అవసరాలకే పరిమితమయ్యింది. దాంతో మాకున్నంత అనుబంధం మా పిల్లలకు ఆ పెట్టెతో లేకుండా పోయింది. పిల్లల అవసరాలు కూడా ఇసుపుల్ల స్థాయి నుంచి ఐస్‌క్రీం స్థాయికి, సోంపాపిడి నుంచి పిజ్జాల స్థాయికి ఎదిగాయి. పావలా, అర్ధ నాణాలకు కాలం చెల్లింది. పది రూపాయల నోటునే పనికి మాలిందానిలా చూస్తున్నారు ఈరోజుల్లో. ఇంక చిల్లర నాణాలు దాచాల్సిన అవసరం ఏముంటుంది. మా అమ్మ బతికున్నంత వరకు మా ఆవిడకు వంటింటితో పెద్దగా అనుబంధం లేదు. అన్నీ మాఅమ్మే చేసి పెట్టేది. దాంతో మా ఆవిడ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చెయ్యటానికి, అటు తరువాత ప్రభుత్వ ఉద్యోగం సంపాదించటానికి వీలుపడింది. దాంతో మా ఆవిడకు వంటగదిలో విన్యాసాలు చెయ్యటానికి అంత సమయం చిక్కేది కాదు. మా అమ్మ బతికున్నంత వరకు వంటింటికి ఆమె మహారాణి, మా ఆవిడ సేనాధిపతి, మా పిల్లలు సైనికులు నిజంగానే ఏ ఇంట్లో అయినా అమ్మే వంటింటికి మహారాణి కాని గిన్నెల మీద నాన్న పేరుంటుంది. ఇదేంటో...!

ఎప్పుడన్నా మేము బయట ఊరికెళితే తప్ప ఏనాడు హోటల్ గడపతొక్కలేదు. మా ఆవిడకు పిల్లలకు వారాంతాలలో హోటల్ కెళ్ళాలని వుండేది. కాని మా అమ్మ వాళ్ళకు కావాల్సినవన్నీ ఇంట్లోనే వండి పెట్టేది. నిజానికి ఇంట్లో ఆరు బయట కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కుటుంబ సభ్యులందరూ కలసి భోజనం చెయ్యటం ఎంత బాగుంటుంది. ఆ ఆనందం అరగంట పాటు గడిపే హోటల్‌లో వస్తుందా. ఆరోగ్యానికి ఆరోగ్యం, ఆనందానికి ఆనందం, అనుబంధాలు బలపడటానికి ఆరు బయట భోజనాలు అని మన పెద్దవాళ్ళు ఊరకే అనలేదు. కాని మన సంస్కృతిలోని నిజాలు తెలియక పైపై మెరుగులతో మిలమిలలాడే కృత్రిమ పరదాల వైపు కలర్స్‌కు ఆకర్షితులై అనుబంధాల విలువలు తెలుసుకోలేక పోతున్నారు. మా పిల్లలు కూడా అందుకు మినహాయింపేమీ కాదు తమ సరదాలకు అమ్మమ్మ అడ్డోస్తోందని అప్పుడప్పుడు నా దగ్గర వాపోయేవారు. మా ఆవిడ కూడా వాళ్ళకు వంత పాడేది. మొదట్లో నేను పెద్దగా పట్టించుకోలేదు కాని రాను రాను వాళ్ళ ఆనందాలకు అమ్మ అడ్డుపడుతోందనే భావన వాళ్ళలో బలంగా ఏర్పడింది. అది గ్రహించి సరిదిద్దక పోవడం కూడా నా తప్పే. అటు అమ్మకు సర్దిచెప్పలేక, ఇటు పిల్లలను సముదాయించలేక చూస్తు వుండిపోయాను. అమ్మతో పాటు అమ్మ వాడే పోపుల పెట్టె కూడా వాళ్ళకి శత్రువుగా మారింది. దాని పర్యావసానమే ఈ రోజు చెత్త కుప్పల మధ్య మా అమ్మ పోపు పెట్టె.



చిన్నగా దాన్ని బయటకు తీసి పైపైన శుభ్రం చేసి దానితో పాటే ఇంట్లోకి అడుగుపెట్టాను. గేటు శబ్ధం విని పిల్లలిద్దరూ అప్పటికే లేచినట్లున్నారు. కాబోలు నాకెదురొచ్చారు. ఆనందంతో, ప్రతిరోజు నేను వాకింగ్ పూర్తి చేసుకుని ఇంట్లోకొచ్చే సమయానికి నాకెదురు రావాలనే నా కోరికను వాళ్ళు గత కొన్ని సంవత్సరాలుగా అలవాటు పడ్డారు. ఇద్దరు నా చేతిలోని పోపుల పెట్టెను చూసి ఒక్కసారిగా తలదించుకున్నారు. నేను మౌనంగా నా గదివైపు నడుస్తుంటే, వాళ్ళిద్దరూ వాళ్ళమ్మతో చెప్పటానికి వంటగది వైపు పరిగెట్టారు. నేను పోపులపెట్టెను శుభ్రం చేస్తున్నంత సేపు వంటగదిలో నుంచి గుసగుసలు వినపడుతున్నాయి. రెండు నిమిషాల తరువాత గుసగుసలు ఆగిపోయాయి, నేను కూడా పోపు పెట్టెను నా 'మ్యూజియం' (పిల్లల భాష భావనతో) లో ఒక పక్కగా పెట్టి గదిలో నుంచి బయటకు వస్తుంటే ఎదురుగా ముగ్గురూ మా ఆవిడ, పిల్లలిద్దరూ 'మిమ్మల్ని బాధపెట్టాలని కాదు, మార్కెట్లోకి కొత్తది వస్తే... అంటూ మా ఆవిడ నసుగుతూనా కోపాన్ని చల్లార్చటానికి ప్రయత్నిస్తుంటే, 'అపునున్న, బట్టు' పిల్లలు నన్ను చుట్టుకున్నారు. నిజమే జీవితం ఒక నదీ ప్రవాహం ఎప్పటికిప్పుడు పాత నీరు పోయి కొత్తనీరు రావాల్సిందే కాని పాత నీటితో వున్న బంధాలు, అనుభందాలు, ఆత్మీయతలను మరిచిపోకూడదు. అవి గుర్తున్నంత వరకు అది జీవనదిలా నిరంతరం మన గుండెల్లె ప్రవహిస్తూనే వుంటుంది.




# కులగోడలను కూల్చింది

**సమాజంలో అగ్రకులాల ఆధిపత్యం, అణచివేతతోపాటు మహిళలు స్వేచ్ఛగా జీవిస్తున్న సందర్భాలు అరుదే. అమ్మాయిల చదువు, ఉద్యోగం వివాహం లాంటివన్నీ ఇప్పటికీ కొన్ని కుటుంబాల్లో కుటుంబ పెద్ద నిర్ణయంపైనే ఆధారపడివుంటాయి. మనువాదం బలంగా వినపడే ఓ కుటుంబంలో పుట్టిపెరిగిన అమ్మాయి తక్కువ కులం అబ్బాయిని వివాహం చేసుకుంటే అది తప్పనే చెప్పింది ఆ కుటుంబం. ఆ మాటలు లెక్కపెట్టకుండా దళితుడిని పెళ్ళిచేసుకోవడం పరువు తక్కువ పనంటూ ఆ అమ్మాయిని కుటుంబం నుండి వెలేశారు. ఈ దారుణం ఇంతటితో ఆగలేదు. కులదురహంకార హత్యలకి దారితీసింది. ఇలాంటి పరిణామాల తర్వాత తనలో మార్పు వస్తుందని ఇంటికి తిరిగొస్తుందన్నారు కులపెద్దలంతా... కులమతాల చిచ్చులో రగిలిన తను మాత్రం నిజమైన ప్రేమను గెలిపించే ప్రయత్నమే చేసింది. తన ఆలోచనలని ఆశయాలని గౌరవించని ఆ కుటుంబానికి దూరంగా ఓ దళిత వాడలో వుంటూ తనలాంటి వారికి న్యాయం కోసం పోరాడుతోంది కౌసల్య.**

తేవర్ తమిళనాడులోని ఓ అగ్రకులం. ఆ కుటుంబానికి చెందిన అమ్మాయి కౌసల్య. నాలుగేళ్ల క్రితం పొలాచి లోని ఇంజనీరింగ్ కాలేజ్‌లో శంకర్‌ని కలుసుకుంది. తనది దగ్గరలోని కుమారలింగం అనే చిన్న పల్లెటూరు. తర్వాతి రోజు బస్‌లో తన వెనుక నుండి ఎవరో పిలవడం గమనించింది కౌసల్య. తన మనసులో మాట చెప్పడానికి వచ్చాడు శంకర్. అచ్చం వాళ్ల అమ్మలా వున్న ఆ అమ్మాయినే పెళ్ళిచేసుకోవాలని తనని చూసినప్పుడే అనుకున్నాడు. అప్పుడు ఆ విషయం చెప్పకపోయినా వాళ్ళిద్దరి మధ్య స్నేహం మాత్రం బలపడింది. ఆ తర్వాత తన ప్రేమని వ్యక్తపరిచాడు శంకర్. కౌసల్యకి తనంటే ఎంతో ఇష్టం. చదువు పూర్తయ్యాక ఇద్దరూ పెళ్ళి కూడా చేసుకోవాలనుకున్నారు. ఆ విషయాన్నే తన తల్లిదండ్రులకి చెప్పింది కౌసల్య. తక్కువ కులం అబ్బాయితో పెళ్ళేంటంటూ తనిన తిట్టడంతోపాటు శంకర్‌ని బెదిరించారు. ఆలాంటి బెదిరింపులకి శంకర్ భయపడలేదు. కౌసల్య అంగీకారంతో తనని పెళ్ళిచేసుకున్నాడు. తమ పెళ్ళికి తల్లిదండ్రులు వ్యతిరేకించినా తన ఆలోచనలని గౌరవిస్తారనుకుంది కౌసల్య. పెళ్లిచేసుకుని వెంటనే తన తల్లిదండ్రుల వద్దకే వెళ్లింది. అక్కడ మాత్రం తనకి అవమానమే ఎదురయ్యింది. పరువు తక్కువ పనిచేశావంటూ తల్లిదండ్రులు, కుల పెద్దలు అవమానించారు. ఆ కుటుంబం నుండి వెలేశారు. అప్పటి నుంచి శంకర్ ఉండే చిన్న ఊరు కుమారలింగమ్‌లోని దళితవాడ తన సొంతూరయ్యింది. అప్పటికి తన వయసు పద్దెనిమిది సంవత్సరాలు. బీటెక్ చదువుతున్నారిద్దరూ. కొంతకాలానికి గొడవలన్నీ సద్దుమణుగుతాయనుకుంది కౌసల్య. అయితే అప్పుడే తన జీవితంలో అసలు ట్విస్ట్ మొదలయ్యింది. తనని ఇంటికి తిరిగిరావాలంటూ బెదిరించడంతోపాటు కాలేజీ నుంచి బలవంతంగా తీసుకెళ్ళే ప్రయత్నాలు జరిగాయి. ఏంచేయాలో తెలీక చదువు మానుకుంది కౌసల్య. ఇలాంటి పరిస్థితుల మధ్యే ఎలాగోలా తన బీటెక్ పూర్తిచేసి ఉద్యోగప్రయత్నంలో వున్నాడు శంకర్.

### ఊహించని ఓ ఘటన

ఆ రోజు శంకర్ పుట్టిన రోజు. కౌసల్య శంకర్‌లకి పెళ్ళై సరిగ్గా ఎనిమిది నెలలు. కొత్త బట్టలు కొనుక్కునేందుకు కౌసల్యతో కలిసి ఉడుమలైపెట్టై పట్టణానికి వెళ్ళాడు. పట్టణంలో అడుగుపెట్టేసరికి అక్కడ బైక్‌లపై కొందరు ఆయుధాలతో కనిపించారు. వీళ్ళని వెంబడించి ఇద్దరిపైనా దాడి జరిపారు. సినిమా ఫైట్‌లా రెప్పపాటులో దాడి జరిగింది. శంకర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణాపాయ స్థితిలో వున్న శంకర్‌ని అక్కడున్న వారి సాయంతో హాస్పిటల్‌కి తీసుకెళ్ళింది కౌసల్య. బతికించడం కష్టమని తేల్చిచెప్పింది అక్కడి వైద్య సిబ్బంది. నెత్తురోడుతున్న అక్కడి నుండి 60కి.మి దూరంలో వున్న కోయంబత్తూర్ జనరల్ హాస్పిటల్‌కి తీసుకెళుతుండగా మధ్యలోనే శంకర్ చనిపోయాడు. ఇదంతా తన తండ్రే చేయించాడని తెలుసుకుంది కౌసల్య. పోలీసుల సాయం కోరినా తనకి ఎలాంటి న్యాయం జరగలేదు. ఈ హింసాత్మక ఘటనపై నిరసన తెలిపిన దళితులపై లాఠీచార్జి జరిగింది. స్థానిక అధికార పార్టీలో తేవర్‌లకి సంబంధించిన వాళ్ళు వుండడంతో శంకర్‌పై దాడికి రాజకీయ అండా తోడయ్యింది. ఆ తర్వాత అగ్రకులాల నుండి ఇలాంటి వివాహాలు మళ్ళీ జరగగూడదంటూ దళితవాడలో వుండే యువకులకి బెదిరింపులు అందాయి. శంకర్‌పై దాడికి సంబంధించి సిసిటీవి పూటేజీలు లభ్యమవ్వడంతో సామాజిక మాధ్యమాల ద్వారా ఇదొక సంచలనంగా మారింది. అలా శంకర్‌పై దాడి జరిగిన వారితో పాటు కౌసల్య తండ్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. శంకర్ మరణం తర్వాత కౌసల్య పుట్టింటికి తిరిగొస్తుందనుకున్నారంతా. అయితే కౌసల్య మాత్రం దళిత వాడలో తన అత్తమామలుండే ఒక చిన్న గదిలో వాళ్ళతోనే కలిసి వుండాలనుకుంది. తనకి అక్కడి ఐద్వా కార్యకర్తలతోపాటు విసికె అండగా నిలిచింది. నిజానికి సిసిటీవి పుటేజీలు లేకపోతే ఈ విషయం అంతటితో ముగిసిపోయేది. ఇలాంటి దాడులు మరింత ఎక్కువయ్యేవంటారు కౌసల్య. చిన్న హెయిర్ కట్, సల్వార్ కమీజ్‌లో పూర్తిగా అబ్బాయిలా కనిపించడమేకాదు ధైర్యాన్ని తెచ్చుకుంది కౌసల్య. మంచి ఉద్యోగంతో శంకర్ కుటుంబానికి అండగా నిలవడంతోపాటు తమిళనాడులోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ కుల హత్యలపై ప్రసంగాలు చేస్తూ అక్కడి వారిలో మార్పుతెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. తన అమ్మానాన్నలు కుల పెద్దలు మాత్రం ఇప్పటికీ తనని శత్రువులానే చూస్తున్నా తనలాంటి వందలాది మంది యువతకి తనో ఆశాకిరణం. ◆

# హాస్య నటులకు మార్గదర్శకం

హాస్యంలో తొణికిసలాడే విజ్ఞానం, చక్కిలిగింతలు పెట్టే ఛలోక్తులు, సంభాషణల్లో మేధస్సు ఆయన సొంతం. మంచి ప్రయోక్తగా, హాస్యనటుడిగా, రచయితగా, దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. కఠోర సత్యాలను నిష్కర్షగా చెప్పగలిగే ధైర్యశాలి. ఆయనే...
ఎం.ఎస్.నారాయణ. మైలవరపు సూర్యనారాయణ (ఎం.ఎస్.నారాయణ) పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం తాలూకాలోని నిడమర్రులో జన్మించారు. తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తూ... ప్రముఖ రచయిత శరత్‌చంద్ర 'శ్రీకాంత్' నవల స్ఫూర్తితో ఏదోకటి చేయాలనే తపన ప్రారంభమైంది ఎమ్మెస్‌లో. రచయితగా తప్పటడుగులు మొదలెట్టి పెద్ద హాస్యనటుడిగా తనకంటూ ఒక ప్రత్యేక శైలిని, ఒరవడిని సంపాదించుకున్నారు. 1992లో వచ్చిన 'అలెగ్జాండర్' సినిమాతో మొదలెట్టి... 2014లో 'పటాస్' చిత్రం వరకూ 691 సినిమాల్లో విభిన్న తరహా పాత్రలను పోషించి, మెప్పించిన అరుదైన హాస్య నటుడు ఎమ్మెస్ నారాయణ. ఆయన జీవితంలోని ఎన్నో ముఖ్యమైన, మధురమైన ఘట్టాలను క్రోడీకరించి ఆద్యంతం ఆసక్తికరంగా 'ఎమ్మెస్ నారాయణ జీవితకథ'ను అక్షరీకరించారు కూనపరాజు కుమార్. రచయితకు సాహిత్యంపై వున్న మిక్కిలి మక్కువతో ఎంతో ఇష్టపడి వెలువరించిన మొదటి పుస్తకం 'న్యూయార్క్ కథలు'. రెండోది తన మిత్రునిపై రాసిన 'ఎమ్మెస్ నారాయణ జీవితకథ'. ఈ పుస్తకంలోని 24 విభాగాల్లో మొత్తం ఎమ్మెస్ జీవితాన్ని నిక్షిప్తం చేశారు రచయిత. మాటల్లోనూ, చేతల్లోనూ అసలైన జీవితం కనిపించదు. అసలైన జీవితం ఆ వ్యక్తి మనసులో నిక్షిప్తమై వుంటుంది. దాన్ని ఒడిసిపట్టుకున్నావి రచయిత. ఎమ్మెస్ బాల్యం, చదువు, ప్రేమ, వాహం, లెక్చరర్‌గా ఉద్యోగం, సినిమా ప్రయత్నాలు, తన కొడుకును హీరోగా పెట్టి సినిమా తీసి చేతులు కాల్చుకోవడం దగ్గర నుంచి అనేక ఆసక్తికర విషయాలను ఎంతో విపులంగా వివరించారు ఈ పుస్తకంలో. ప్రసాదమూర్తి ఎమ్మెస్‌పై రాసిన కవితలు, ఎంతో శ్రమించి అనిల్ బత్తుల సేకరించిన ఎమ్మెస్ ఫిల్మోగ్రఫీ ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణలు. బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, పరుచూరి గోపాలకృష్ణలు ఎమ్మెస్‌తో తమకున్న అనుబంధాన్ని పంచుకుంటూ కన్నీటిపర్యంతమైన వైనం గుండెను కదిపి కుదుపుతుంది. ఒకరకంగా ఎమ్మెస్ నారాయణ తన ఆత్మకథను తానే రాసుకున్నంత గొప్పగా ఆయన జీవితంలోని ఎత్తుపల్లాలను అక్షర రూపంలో మన ముందు నిలిపారు. తన సినిమా కష్టాల గురించి ప్రస్తావిస్తూ... 'ప్రయత్నిస్తూ మరణిస్తే గెలిచినట్లే. ప్రయత్నం విరమిస్తే మరణించినట్లే'అని డైరీలో రాసుకొని వర్క్ ప్రారంభించినట్లుగా ఆయన చెపుతారు. దాదాపు 200కు పైగా తాగుబోతు క్యారెక్టర్లను ఏమాత్రం మొనాటనీకి ఆస్కారం లేకుండా పోషించి మెప్పించారంటేనే ఆయన విజయంలో కృషి పాత్ర ఎంతుందో చెప్పొచ్చు.

**- రాజాబాబు కంచర్ల**

**రచయిత :** కూనపరాజు కుమార్
**పుస్తకం పేరు :** ఎమ్మెస్ నారాయణ (జీవిత కథ)
**వెల :**175/-, **పేజీలు :** 208
**ప్రతులకు :**సాహితీ ప్రచురణలు, 33R22R2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్. రోడ్, చుట్టుగుంట, విజయవాడ-520004
**ఫోన్ :** 0866 2436642/43, 8121098500.

# కంటి కెమెరామెన్

సైబోర్గ్‌లు గురించి వినే ఉంటారు. దేహంలో ఓ అవయవం బదులు రోబోటిక్ పరికరం పెట్టుకుంటారు. ఇలా సగం మర మనిషిగా సమాజం తయారయ్యేది ఇంకెంతో దూరంలో లేదని కొందరు ఊదరగొడుతుంటారు. రోబోలా మనిషి తయారవుతాడా? లేదా ముందే రోబోనే మనిషిలా తయారవుతుందా? అనేది పెద్ద ప్రశ్నే. ఏదేమైనా ఇదే సాంకేతికతతో కెనడా డాక్యుమెంటరీ ఫిల్మ్‌మేకర్ రాబ్ స్పెన్స్ కెమెరా కన్నును బిగించుకున్నాడు. ఈ ప్రొస్తెటిక్ కన్ను అటు వీడియో కెమెరాగాను పనిచేస్తుంది. చిన్నప్పుడు రాబ్ తుపాకీతో తనను తాను అనుకోకుండా కాల్చుకున్నాడు. అప్పుడే కుడి కన్ను దెబ్బతింది. 2007లో కార్నియాతో సహా తీసేయాల్సిన పరిస్థితి ఎదురైంది. అప్పుడు తనకో ఆలోచన కలిగింది. ఎలక్ట్రానిక్ ఇంజినీర్ కోస్తా గ్రామటీస్‌ను కలిశాడు. ఆయనే ఈ వైర్‌లెస్ కెమెరా కన్నును రూపొందించాడు. ప్రొస్తెటిక్ కంటి వెనుకభాగంలో పరికరం అమర్చారు. ఓ బుల్లి ట్రాన్స్‌మిట్టర్, బ్యాటరీ, మినియేచర్ కెమెరా,

మాగ్నెటిక్ స్విచ్ వంటివన్నీ కలిసి ఇది పనిచేస్తుంది. స్పెన్స్ ఎప్పుడు కావాలంటే అప్పుడు కెమెరా పనిచేయడానికి మాగ్నెటిక్ స్విచ్ ఉపయోగపడుతుంది. కెమెరా అందుకునే సమాచారాన్ని మిగతా మీడియాకు పంచేలా ఎలక్ట్రికల్ ఇంజినీర్ మార్టిన్ లింగ ఓ సూక్ష్మ సర్క్యూట్ బోర్డును రూపొందించాడు. కంటి నిపుణుడు ఫిల్ బోవెన్ ఆ పరికరానికి తగ్గ ప్రొస్తెటిక్ కంటి గూడును తయారుచేశాడు. ఈ ప్రాజెక్ట్‌కు 'ఐ-బోర్గ్' అని పేరుపెట్టారు. 2008లో తొలిసారి దీన్ని రాబ్ ఉపయోగించాడు. 30 నిమిషాల పాటు రికార్డు చేసే ఈ కెమెరా కన్నుతో నడుస్తుంటే 'పీ.ఓ.వీ' ఎఫెక్ట్ బాగా తెలుస్తుందని, అది తన చిత్రాలకు బాగా ఉపయోగపడుతోందని రాబ్ అంటాడు. 'పీ.ఓ.వీ.' అంటే 'పాయింట్ ఆఫ్ వ్యూ'. అంటే మనం చూసే ప్రపంచం ఎలా ఉందో.. మన కంటి కదలికలు బట్టి దృశ్యాలు ఎలా కనిపిస్తాయో అలానే వీడియోలో రికార్డు చేయడం. రెప్పవాల్చినపుడు ఎలా ఉంటుందో కూడా ఐబోర్గ్ చూపెడుతుంది. కానీ, సమస్యల్లా ఎదుటివారి అనుమతి లేకుండా తాను వెళ్లిన చోటల్లా ఈ కన్ను చిత్రీకరించడమే. అందుకే దీనికి ఓ ఎర్ర ఎల్‌ఈడీ లైట్‌ను ఏర్పాటు చేశారు. ఎదుటి వారికి రాబ్ కంటిలో కెమెరా ఉందని తేలిగ్గా తెలుస్తుంది కాబట్టి జాగ్రత్త పడతారు. నీల్స్ హార్బిస్సన్ అనే మరో వ్యక్తి కలర్ బ్లైండ్. ఆయనకు కళ్లు సరిగ్గా కనిపించవు. కానీ రంగుల్ని సంగీతంలా మార్చే ఓ పరికరం ఆయన దేహంలో ఉంది. అలాగే కెవిన్ వార్విక్ అనే వ్యక్తి తాను పూర్తి స్థాయి సైబోర్గ్‌గా మారేందుకు దేహంలో ఎలక్ట్రానిక్ పరికరాల్ని పెంచేసుకుంటూ పోతున్నాడు. ఇలా సైబోర్గ్ ప్రపంచం నిదానంగా చొరబడుతోంది.

# ఛాయా చిత్రాలేనా..?

విశేషం

అచ్చు ఛాయాచిత్రంలా బొమ్మ గీయడం మరీ కష్టమా..? అది కూడా ఒట్టి నల్ల రంగు పెన్సిల్‌తో అయితే అసాధ్యమా...? అయితే మీకు చార్‌కోల్ ఆర్టిస్ట్ ఎమిలీ కోప్‌ల్యాండ్‌ను పరిచయం

చేయాలి. ఈ అమ్మాయికి 23 ఏళ్లే. కానీ, ఫొటో రియలిజమ్ శైలిలో మంచి నిపుణురాలు. న్యూయార్క్‌లో ఉండే ఎమిలీకి వింటేజీ, రెట్రో వస్తువులంటే మరీ మోజు. వాటిని తన కళా వస్తువులుగా తీసుకుంటుంది. ప్రస్తుత తరం పూర్తిగా మర్చిపోయిన వస్తువుల్ని తన చిత్రాల ద్వారా ప్రచారం చేయడం తనకిష్టం. ఈ చిత్రాల్లోని సర్రియల్, మోనుమెంటల్ శైలి వాటిని ఫొటోగ్రాఫ్‌లనుకునేలా చేస్తాయి. ప్రతి చిన్న డిటైల్‌ను విడిచిపెట్టకుండా చిత్రాన్ని గీయడం వల్లే వాటికా లుక్ వస్తుంది. నలుపు-తెలుపులదో సమస్య. వస్తువులు దాని విలక్షణతను కోల్పోవడమో అదనపు విభిన్నత దానికి చేకూరడమో జరుగుతుంది. అయితే గ్రేస్కేల్‌లోని కాంట్రాస్ట్‌నే ఆధారం చేసుకుని ఆమె చిత్రాల్లో లోతు తీసుకువస్తుంది. దీని వల్ల వాటికి 3డి ఎఫెక్ట్ కూడా వస్తుంది. ఇదే ఆమె చిత్రాలు సజీవతను కలిగి ఉంటానికి కారణం. తాను వాడే చార్‌కోల్ పెన్సిళ్లతో సమస్యేంటంటే ఓ చిన్న గీతను చెరపడం కూడా కష్టమే. అలా చేస్తే పక్కనున్న డిటైల్స్ కూడా పాడైపోయి ఆ ఆర్ట్‌వర్క్‌ను అక్కడితో ఆపేయాల్సిన పరిస్థితి వస్తుంది. చిత్రాల్లోని డిటైల్స్‌ను చూపించడానికి ఆమెకు బరోక్ శతాబ్దపు చిత్రకారులు కారావాజియో శైలి పనికి వచ్చింది. ఆయన ఉపయోగించే చియారోస్కురో ద్వారా నీడల జాడ కనిపిస్తుంది. కాంట్రాస్ట్‌ను ఎలా ఉపయోగించాలో కూడా ఆయన చిత్రాలు చెబుతాయి. ఈ టెక్నిక్‌ల మీద కసరత్తు చేసిన ఎమిలీ తాను వేయాలనుకున్న వస్తువుల్ని వెదకడంలోను ప్రత్యేకత చూపింది. వస్తువులతో కొందరు వ్యక్తులు కనెక్ట్ అయ్యి ఉంటారు. వాటి వెనుక ఏదో ప్రత్యేక కథ ఉంటుంది. మరీ సొంతగా చేసుకున్న వస్తువులనే సేకరించి ఆమె చిత్రాలు వేసింది. తనకు ఎంతో ఇష్టమైన వింటేజీనే కాక డిస్కో బాల్ ఇలా ఎన్నో సృజనకు సవాల్ విసిరే వస్తువులనే ఎంచుకుంది. అవి తళుక్కుమనడం నిజంగా మాయాజాలంగానే అనిపిస్తుంది. కావాలంటే మీరూ చూడండి.



# మత్తును ఓడించిన కిక్కు

**కన్నతల్లి లాంటి ఊరిని డ్రగ్స్ భూతం పట్టింది. ఆ మత్తును చిత్తు చేయాలంటే ఎలా అని మంగళదాస్ మథనపడ్డాడు. యువత దానికి మొహంమొత్తేలా చేసి అంతగా ఆకట్టుకునేదేంటా అని ఆలోచించాడు. ఆయనకు ఫుట్‌బాల్ ఆలోచనల్లో తన్నింది. ఆ ఆట ఆడటం అలవాటైతే ఊరికే ఉండలేరనే విషయం గమనించాడు. ఆ ఆటతోనే మాదక ద్రవ్యాలకు బానిసైన రుర్కా కలాన్ ఊరి మత్తు వదిలించేశాడు. ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చదివి ఆ ఊరి నుంచే వెళ్లి అమెరికాలో స్థిరపడిన మంగళదాస్ సొంత ఊరికేదైనా చేయాలన్న సంకల్పంతో 14 ఏళ్ల పాటు అన్ని తానై ఆదుకున్నాడు. ఆయన స్థాపించిన రుర్కా కలాన్ యూత్ ఫుట్‌బాల్ క్లబ్ దేశానికి గొప్ప ఫుట్‌బాల్ ఆటగాళ్లను ఇచ్చింది. అందుకే ఆటకే కాక గ్రామానికే గురువును చేసుకున్నారు రుర్కా కలాన్‌వాసులు.**

అది 2001.. పంజాబ్ రాష్ట్రంలోని పగ్వారాకు 40 కిలోమీటర్ల సమీపంలోని రుర్కా కలాన్ అనే శివారు గ్రామం. నేరాలు.. డ్రగ్స్‌తో అతలాకుతలమై యువతంతా తమ జీవితాలను పూర్తిగా నిర్వీర్యం చేసేసుకున్నారు. గురు మంగళ్ దాస్ ఊరి పరిస్థితిని తెలుసుకుని ఏదైనా చేసి మార్చాలని మనసులో ధృడ సంకల్పంతో శ్రీమంతుడిలాగా రుర్కా కలాన్‌లో అడుగుపెట్టాడు. మామూలుగా ఎన్ని చర్చలు జరిపినా సభలు పెట్టినా కౌన్సెలింగ్‌లిచ్చినా పరిస్థితి మారలేదు. కళ్ల ముందే తన తరం తన తర్వాతి తరం మత్తు కోరల్లో పడి గిలగిలలాడటం ఆయన చూడలేకపోయాడు. ఎలాగైనా సరే వారిని సన్మార్గంలో పెట్టాలని అక్కడే ఉండిపోయాడు. 'తమకేమి చేతకాదు.. ఈ జీవితాలు అంతే' అనే మాట ఆయనకు అక్కడ పదేపదే వినిపించేది. ఎలాంటి ఉద్యోగాలు లేక వారంతా ఖాళీగా ఉన్నారని గమనించిన మంగళ్ దాస్‌కు ఓ అంశం ఆశ్చర్యపరిచింది. ఈ గ్రామంలో క్రికెట్ కన్నా ఫుట్‌బాల్ గురించే ఎక్కువ అభిమానులు కనిపించారు. అంత మత్తులోను వారి మాటల్లో ఫుట్‌బాల్ సొదే ఎక్కువ. యువతలో స్వతహాగా ఉన్న ఫుట్‌బాల్‌పై అమితాసక్తినే ఆయుధం చేసుకున్నాడు. ఈ క్రీడ ద్వారా వారిని మరింత ప్రయోజకులుగా తీర్చిదిద్దవచ్చునని పెద్దల్ని ఒప్పించాడు. అనుకున్నదే తడవుగా ఫుట్‌బాల్ శిక్షణ కేంద్రం తలుపులు బార్లా తీశాడు. ప్రతి ఇంటి నుంచి ఒక్కర్ని అయినా విధిగా ఈ శిక్షణకు పంపాలని విజ్ఞప్తి చేశాడు. వారికి శిక్షణా శిబిరాలు మొదలెట్టాడు. ఆయన పిలుపు యువతకు నచ్చింది. అంతవరకు పెద్దలు ఆటపాటలు, మత్తు మందేనా జీవితం అని తిట్టేవారు. మత్తు అంటే రహస్యంగా తీసుకోవచ్చు కానీ ఆట అంటే బహిరంగంగా ఆడాల్సిందే కదా. ఇప్పుడు వీరి అడ్డంకి తొలగిపోవడమే కాక టీవీల్లో కనిపించే క్రీడాకారుల్లా తమ క్లబ్‌కంటూ ఓ ప్రత్యేకమైన జెర్సీ.. ఫుట్‌బాల్ మైదానం అన్నీ తెగ నచ్చేశాయి. పెద్దలు కూడా ప్రోత్సహించడంతో వారికి ఫుట్‌బాల్ మైదానమే జీవితమై పోయింది. ఎక్కడ ఫుట్‌బాల్‌ను గోల్ పోస్ట్ వైపు కిక్కు కొట్టకుండా పోతామనో మత్తు కిక్కును పక్కనబెట్టడం మెల్లిగా మొదలెట్టారు. కొన్ని నెలలు అలా గడిచేసరికి గాలికి ఊరికే తిరిగే యువకులంతా మంగళ్‌దాస్ శిబిరంలో శిక్షణలో బిజీ అయి పోయారు. ఇందులో భాగంగా శిక్షణలో ప్రతిభ చూపిన వారిలోనే 15 నుంచి 20 ఏళ్ల లోపు వారితో జట్ల కూర్పును పూర్తి చేశాడు. వీరి కోసం ఎక్కువ

సంఖ్యలో స్థానిక టోర్నీలను మంగళ్ దాస్ నిర్వహించాడు. వారిలో యువశక్తి నిరూపించుకునే అవకాశం రావడంతో పెద్ద సంఖ్యలోనే యువత పోటీపడింది. ఇందులో విజేతలుగా నిలిచిన జట్లకు నగదు పురస్కారాలను అందజేశాడు. విజేతలైన జట్ల తాలూకా నుంచి బ్యాంకు అకౌంట్ల ద్వారా కార్పస్ ఫండ్‌కు శ్రీకారం చుట్టాడు. అలా మొదలైన ఆటతీరు గ్రామీణ వాతావరణంలో ప్రశాంతతకు దారి తీసింది. ఈ విధమైన మార్పుతో ఇంకొంత మంది ప్రేరణ చెందారు. ఈ కారణంగా 'మనం సాధించగలం' అన్న నమ్మకం అక్కడ ప్రజల్లో ప్రోది చేసుకుంది. ఆరేళ్లు గడిచేటప్పటికి వేలల్లో ఫుట్‌బాల్ ఆడేవారి సంఖ్య విస్తరించింది. రుర్కా కలాన్ శివారు నుంచి పగ్వారాలోని మరో 20 కిలోమీటర్ల వరకు ఈ క్రీడే హల్‌చల్ చేసింది. ఆ తర్వాత ప్రతి ఇంటికి వెళ్లి తన భవిష్యత్ ప్రణాళికలను మంగళ్‌దాస్ వివరించాడు. 'మీరు నాపై నమ్మకం ఉంచి మీ పిల్లల్ని ఫుట్‌బాల్ ఆడేందుకు పంపించాలని, వారిని మరింత శక్తిమంతంగా తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటానని' ఒప్పించాడు. 2015 నాటికి పంజాబ్‌లోని 9 గ్రామాలకు కొత్త ఫుట్‌బాల్ క్లబ్ విస్తరించింది. యువతకు విద్యా, క్రీడ, ఆరోగ్యం అన్ని సేవలను ఈ క్లబ్ ద్వారా అందించే ఉన్నతమైన క్లబ్‌గా ఉద్భవించింది.

**అకాడమీ వచ్చేసింది**

ఫుట్‌బాల్ గ్రామంగా మారిన రుర్కా కలాన్‌లోనే ఉచితంగా క్రీడాకారులు అన్ని సేవలను పొందేలా ప్రత్యేకంగా రుర్కా కలాన్ యూత్ ఫుట్‌బాల్ అకాడమీని 2006లో ఏర్పాటు చేశారు. దీనికి గ్రామం అంతా కలిసి రావడంతో స్థలంతో పాటు ట్రాక్టర్లు, ఇతర శ్రమను అందించడంతో సరికొత్త అకాడమీ అందరికి చేరువైంది. ఈ క్లబ్ జట్టు తన శక్తిని నిరూపించుకుని పలు టోర్నీల్లో ఘన విజయాల బాటను పట్టింది. వైఎఫ్‌సి ఆధ్వర్యంలోనే పూర్తిస్థాయిలో రెసిడెన్షియల్ ఫుట్‌బాల్ అకాడమీని ప్రారంభించారు. ఈ అకాడమీ ఆధ్వర్యంలో ఐదువేల సీట్ల భర్తీ సాగింది. ఈ క్లబ్ సత్తా ఆ నోటా ఈ నోటా విని ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు భూరి విరాళాలను అందివ్వసాగారు. 2010 మార్చిలో దక్షిణాఫ్రికా స్ట్రీట్ చైల్డ్ వరల్డ్‌కప్ సాకర్ టోర్నీలో వైఎఫ్‌సి బాలుర జట్టు రన్నరప్‌ను సాధించింది. 2011లో మాంచెస్టర్‌లోని గుర్గావ్‌లో జరిగిన యునైటెడ్ ప్రీమియర్ కప్‌లో రన్నరప్‌ను సాధించింది. 2010-2012 మధ్య ఈ జట్టు పంజాబ్ స్కూల్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో టాప్-3గా నిలిచాయి. దేశానికి అత్యంత ఎక్కువ మంది ఫుట్‌బాలర్స్‌ను అందించిన ఘనత వహించిందా గ్రామం.

**- ఈశ్వర్ నెట్టెం**

# చెర్రీ ఐస్‌ట్యూబ్

**కావాల్సిన పదార్థాలు**

చెర్రీలు-1 1/2 కప్పు
తేనె-1/4 కప్పు
పంచదార పొడి-1/2 కప్పు
పాలు-1 కప్పు

**తయారుచేసే విధానం**

ముందుగా చెర్రీల్లో గింజలు తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక పాన్ తీసుకుని పాలు, చెర్రీలు, పంచదార వేసి బాగా మరిగించుకోవాలి. బాగా దగ్గరకు అయిన తర్వాత స్టౌమీద నుంచి దించేసుకుని మిక్సీలో వేసి బ్లెండ్ చేసుకోవాలి. తర్వాత తేనె వేసి బాగా కలిపి ఐస్ ట్యూబ్‌ల్లో వేసుకుని ఫ్రిజ్‌లో పెట్టుకుంటే చెర్రీ ఐస్ ట్యూబ్ రెడీ.



# ద్రాక్ష ఐస్‌క్రీమ్

**కావాల్సిన పదార్థాలు**

ద్రాక్షపళ్ళు-1/2 కిలో
నిమ్మకాయ-1
పంచదార పొడి-1 కప్పు
పాలు-కప్పు
గుడ్డు-1

**తయారుచేసే విధానం**

ముందుగా ద్రాక్షపళ్ళను జ్యూస్ చేసుకుని వడగట్టుకొని పక్కనపెట్టుకోవాలి. ఇప్పుడు ఆ జ్యూస్‌లో నిమ్మరసం గుడ్డు కలుపుకుని ఒక 20 నిమిషాలు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. తరువాత ఒక పాన్ తీసుకుని అందులో పాలు, పంచదార వేసి బాగా మరిగించాలి. తర్వాత జ్యూస్ ఫ్రిజ్‌లోంచి బయటకుతీసి అందులో పాల మిశ్రమాన్ని కలిపి డీప్ ఫ్రిజ్‌లో పెట్టుకుంటే రుచికరమైన ద్రాక్ష ఐస్ క్రీమ్ రెడీ!



# సపోటా ఐస్‌క్రీమ్

**కావాల్సిన పదార్థాలు**

సపోటాలు-5
పాలు-1/2 కప్పు
తేనె-1 టేబుల్ స్పూన్
పంచదార పొడి -1/2 కప్పు
గ్లూకోజ్ -1/4 కప్పు

**తయారుచేసే విధానం**

ముందుగా సపోటా ముక్కలును మిక్సీలో వేసుకుని జ్యూస్‌లా చేసుకోవాలి. తర్వాత అందులో పాలు, పంచదార వేసుకుని మరోసారి మిక్సీలో వేసి బ్లెండ్ చేసుకోవాలి. ఇప్పుడు ఒక బౌల్‌లోకి ఈ మిశ్రమాన్ని తీసుకుని అందులో తేనె, గ్లూకోజ్ చేర్చి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఆ బౌల్‌ను ఫ్రిజ్‌లో పెట్టి ఒక గంట తర్వాత బైటికి తీసి చల్ల చల్లగా సపోటా ఐస్ క్రీమ్‌ని టేస్ట్ చేయండి.



# ఖర్జూరం ఐస్ క్రీమ్

**కావాల్సిన పదార్థాలు**

ఖర్జూరం -15(గింజలు తీసినవి)
పాలు-2 కప్పులు
గుడ్లు-3
వెనీలా-2 చుక్కలు

**తయారుచేసే విధానం**

ముందుగా ఒక పాత్ర తీసుకుని అందులో పంచదార, నీరు వేసుకుని పంచదార కరిగేదాకా మరిగించాలి. తరువాత అందులో ఖర్జూరం వేసుకుని మెత్తగా ఉడికించుకోవాలి. మిక్సీలో ఈ మిశ్రమాన్ని వేసి మరీ మెత్తగా కాకుండా బ్లెండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక జార్‌లోకి తీసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక బౌల్ తీసుకుని అందులో పాలు, గుడ్లు వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు రెండు మిశ్రమాలనూ ఒక బౌల్‌లోకి చేర్చి ఐస్‌క్రీమ్ మేకర్‌లో కానీ డీప్ ఫ్రిజ్‌లో కానీ పెట్టుకుంటే ఖర్జూరం ఐస్‌క్రీమ్ రెడీ.

# బాల నేస్తాలు

## కనిపెట్టండి

అగ్గిపుల్లలతో చేసిన ఈ ఆకారంలో మూడుపుల్లల్ని కదిలిస్తే మొత్తం రెండు త్రిభుజాలు ఏర్పడతాయి. అదెలాగో కనిపెట్టండి.





## బొమ్మలు పూరిద్దాం

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ముందుగా బొమ్మల్ని సగం గీసి ఉంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తిచేయండే!



## పదాలు కనిపెడదాం

ఇక్కడ అక్షరాల పట్టికలో కొన్ని అక్షరాలు ఉన్నాయి. కింద ఇచ్చిన పదాలు ఆ అక్షరాల్లో ఎక్కడున్నాయో గుర్తించి పెన్‌తో మార్క్ చేయండి.



| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| N | M | A | R | K | E | O | N | U | S |
| O | U | M | B | C | A | V | E | A | N |
| M | N | S | E | A | R | T | H | J | E |
| V | A | W | N | R | U | T | A | S | P |
| E | H | R | O | E | C | O | V | N | T |
| N | B | E | S | Y | S | U | N | A | U |
| U | J | U | P | I | T | E | R | O | N |
| S | N | S | U | N | A | R | U | Y | E |
| J | O | S | Y | E | T | N | H | | |

**Word Box**

| | | | |
|---|---|---|---|
| Mercury | Venus | Earth | Mars |
| Jupiter | Saturn | Uranus | Neptune |

## గుర్తు పట్టండి

పై చిత్రంలో మనింట్లో ఉపయోగించే కొన్ని వస్తువులు దాగున్నాయి. అవెక్కడున్నాయో కనిపెట్టి సున్నాచుట్టేయండే.





## ఆకులతో బొమ్మ

మనింటి ముందు రాలి పడుతుండే ఎండు, పచ్చి ఆకులతో జంతువుల బొమ్మలు ఎలా చేయొచ్చో ఇక్కడ ఇచ్చాం! వాటిని గమనించి మీరూ తయారుచేసేయండే!

## తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. వాటిని మీరు గుర్తించి సున్నాచుట్టేయండి.





# 13 ఏళ్లు 100 టోర్నమెంట్లు

పిల్లలూ మీకు రకరకాల ఆటల గురించి తెలిసే వుంటుంది. మరి మీకు గోల్ఫ్ క్రీడ గురించి తెలుసా? ఎందుకంటే ఇప్పుడీ క్రీడలో వందకుపైగా టోర్నమెంట్‌లని గెలిచి అతి చిన్న గోల్ఫర్‌గా పేరు తెచ్చుకున్నాడు శుభమ్ జగ్‌లాన్. నిన్న మొన్నటి దాకా గోల్ఫ్ సంపన్నులకి మాత్రమే పరిమితమైన క్రీడగా వుండేది. అలాంటి ఓ క్రీడలో మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన శుభం ఎలా నిలదొక్కుకోగలిగాడో మీరూ తెలుసుకోండి.

పానిపట్‌లోని ఇస్రనా గ్రామంలో పుట్టి పెరిగాడు శుభమ్ జగ్లాన్(13). ఆ గ్రామంలో ఎక్కువ మంది కుస్తీలో ఆరితేరిన వారే. తన కుటుంబంలోనూ కుస్తీ ఆటలో ప్రావీణ్యం వున్న వాళ్ళు ఎక్కువే. శుభం పుట్టాక తమ కుటుంబంలో ఓ చిన్న పెహల్వాన్ పుట్టాడనుకున్నాడు తండ్రి జగ్బాల్. అయితే తను మాత్రం గోల్ఫ్ క్రీడపై ఇష్టాన్ని పెంచుకున్నాడు. అలా ఐదేళ్ళ వయసుకే టీవీలో ఆటని చూస్తూ శుభం ఒక కర్రతో బంతిని నెట్టడం ఆయన్ని ఆశ్చర్యపరిచింది. అయితే శుభం కుటుంబ సభ్యులు మాత్రం తమ ఆర్థిక పరిస్థితుల కారణంగా తనని ఆ దిశగా ప్రోత్సహించలేదు. కానీ తాతగారి ప్రోత్సాహంతో ఐదేళ్ల వయసుకే గోల్ఫ్ శిక్షణ మొదలు పెట్టాడు శుభం. ఆయనే పానీపట్‌లోని ఓ గోల్ఫ్ అకాడమీకి తీసుకెళ్ళి శిక్షణ ఇప్పించేవారు. అందరిలా కాకుండా తన కుటుంబంలో శుభం ఒక ప్రత్యేక గుర్తింపుని తెచ్చుకోవాలనే ఆయన కల. అయితే శుభం శిక్షణ తీసుకుంటున్న అకాడమీ కొన్నాళ్ళకి మూతపడింది. శుభం ఈ క్రీడకి దూరమవుతాడనుకున్నారంతా. అయితే తన కోచ్ ద్వారా గోల్ఫ్‌లో శుభమ్ ఆసక్తిని తెలుసుకున్న తండ్రి జగ్బాల్. ఇంటి వెనుక ఖాళీ ప్రదేశంలో చిన్న గోల్ఫ్ కోర్టుని ఏర్పాటు చేయడంతో పాటు క్రీడకి సంబంధించిన సిడిలని కొనితెచ్చేవాడు. అలా సొంతగానే కొన్నాళ్ళు సాధన చేశాడు జగ్బాల్. గంటల తరబడి ఒంటరిగానే ప్రాక్టీస్ చేసేవాడు శుభం. అప్పుడే క్రీడపై శుభం ఎంతగా ఇష్టపడుతున్నాడో అర్థమయ్యింది జగ్బాల్‌కి. తనకి మంచి శిక్షణ ఇప్పించేందుకు జగ్బాల్ కుటుంబం ఢిల్లీకి షిఫ్ట్ అయ్యింది. అక్కడే 'ది గోల్ఫ్ ఫౌండేషన్' వ్యవస్థాపకుడు అమిత్ లుత్రా వద్ద గోల్ఫ్‌లో శిక్షణతీసుకున్నాడు శుభం. ఆ తర్వాత ఎన్నో టోర్నమెంట్లలో అద్భుతమైన ఆటతీరుతో పథకాలు గెలుచుకున్నాడు శుభం. వరల్డ్ మాస్టర్స్ ఆఫ్ జూనియర్ గోల్ఫ్, జూనియర్ వరల్డ్ గోల్ఫ్ చాంపియన్స్, యూరోపియన్ వరల్డ్ చాంపియన్‌షిప్ ఇలా వివిధ పోటీలో పతకాలు సాధించాడు శుభం. 2015లో శాన్ డైగొ లో జరిగిన కల్లావే వరల్డ్ చాంపియన్ షిప్ విజయం తర్వాత తను వెనుదిరగలేదు. 2017లో దక్షిణ బెంగాల్ జూనియర్ బాలుర గోల్ఫ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని జట్టు విజయానికి కీలకమయ్యాడు శుభమ్. ✦

# పదవికాసం 74

కూర్పు : రావెళ్ల

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ✿ | 3 | 4 | | 5 |
| | ✿ | | ✿ | 6 | ✿ | | ✿ | |
| 7 | | ✿ | 8 | | | ✿ | 9 | |
| | ✿ | 10 | ✿ | | ✿ | 11 | ✿ | |
| ✿ | 12 | | | ✿ | 13 | | | ✿ |
| 14 | ✿ | | ✿ | 15 | ✿ | | ✿ | 16 |
| 17 | | ✿ | 18 | | | ✿ | 19 | |
| | ✿ | 20 | ✿ | | ✿ | 21 | ✿ | |
| 22 | | | | ✿ | 23 | | | |

## ఆధారాలు

### అడ్డం

1. దట్టమైన అడవి (4)
3. ధర్మంతో ముగిసిన చావు (4)
7. మోసం (2)
8. తటాకం (3)
9. సేవకురాలు (2)
12. మాత్ర (3)
13. వంపు (3)
17. దిగులు (2)
18. భూమి (3)
19. బాట (2)
22. తడబాటు (4)
23. ప్రాచీనం (4)

### నిలువు

1. శ్రామికుడు (4)
2. ఆవు, గేదెల మలం కింది నుండి (2)
4. లాభం (2)
5. వంచన తల కిందులైంది (4)
6. పరుగెత్తు (3)
10. దీపజ్వాల (3)
11. ఆహ్వానం (3)
14. పరిపక్వత (4)
15. పూర్వ వృత్తాంతం (3)
16. తల వంపు (4)
20. నెత్తురు పీల్చే కీటకం (2)
21. శిబిరం (2)

## సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 3 | | | 7 | | | | |
| 6 | | | 1 | 9 | 5 | | | |
| | 9 | 8 | | | | | 6 | |
| 8 | | | | 6 | | | | 3 |
| 4 | | | 8 | | 3 | | | 1 |
| 7 | | | | 2 | | | | 6 |
| | 6 | | | | | 2 | 8 | |
| | | | 4 | 1 | 9 | | | 5 |
| | | | | 8 | | | 7 | 9 |

## గతవారం జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 1 | 4 | 6 | 9 | 7 | 2 | 3 | 8 |
| 2 | 3 | 6 | 1 | 4 | 8 | 9 | 7 | 5 |
| 7 | 8 | 9 | 5 | 2 | 3 | 6 | 1 | 4 |
| 1 | 6 | 5 | 3 | 8 | 9 | 7 | 4 | 2 |
| 4 | 7 | 3 | 2 | 5 | 6 | 1 | 8 | 9 |
| 8 | 9 | 2 | 4 | 7 | 1 | 3 | 5 | 6 |
| 3 | 4 | 8 | 9 | 1 | 2 | 5 | 6 | 7 |
| 6 | 2 | 7 | 8 | 3 | 5 | 4 | 9 | 1 |
| 9 | 5 | 1 | 7 | 6 | 4 | 8 | 2 | 3 |

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ✿ | 1 జీ | 2 వి | త | ✿ | 3 ర | 4 క్ష | సి | ✿ |
| 5 ని | ✿ | షం | ✿ | 6 శ్రీ | ✿ | తి | ✿ | 7 త |
| 8 మి | షం | ✿ | 9 ప్ర | వా | హం | ✿ | 10 జా | మా |
| షం | ✿ | 11 బ | ✿ | రు | ✿ | 12 త | ✿ | షా |
| ✿ | 13 వి | క | ము | ✿ | 14 వి | లా | పం | ✿ |
| 15 వి | ✿ | ము | ✿ | 16 ఆ | ✿ | పి | ✿ | 17 మ |
| 18 జ | ల్లి | ✿ | 19 మా | రా | జు | ✿ | 20 పా | దు |
| యం | ✿ | 21 జా | ✿ | మం | ✿ | 22 భా | ✿ | పు |
| ✿ | 23 న | గా | రా | ✿ | 24 వృ | ష | భం | ✿ |

ఆకులో ఆకై.. కొమ్మలో కొమ్మై.. ఊసరవెల్లి పరిసరాల్లో కలిసిపోతుంది. ఇదే పెరూకి చెందిన సెసీలియా పారడెస్‌కు తెగ నచ్చేసింది. దానిలా తాను చుట్టుపక్కల ఆకృతుల్లో కలసిపోవాలని బాడీ ఆర్టిస్ట్‌గా మారిపోయింది. థియేటర్, లిథోగ్రఫీల్లో ఆమె అంతర్జాతీయ కళాకారిణి. తన ఇంటిపేరుకి స్పానిష్‌లో అర్థం కుడ్యమని. అందుకే తన దేహాన్నే కుడ్యచిత్రంగా మలిచేసి ఊసరవెల్లిలా గోడల మీది ఆకృతుల్లో.. రంగుల్లో కలిసిపోయే కొత్త కళను రూపొందించింది. బాడీ పెయింట్ వేసుకుని గోడల వద్ద నిలుచుంటే అక్కడామె ఉందా లేదా అనే విషయం అంతుబట్టదు. వీక్షకుల్ని ఇబ్బంది పెట్టకుండా జుట్టునో, చెవినో, చేతినో స్పష్టంగా కనబడేలా వదిలేస్తుంది. ఇలా ఇరవై ఏళ్ల నుంచి అనేక సిరీస్‌లుగా ఆమె ప్రదర్శనలు ఇస్తూ ప్రపంచమంతా చుడుతోంది. 'ల్యాండ్‌స్కేప్స్', 'మెడిటేటివ్ మెర్మైడ్', 'ఏసియా', 'టుట్టి-ఫ్రూటీ', 'స్కిన్ డీప్', 'క్రిస్తాంటెమో', 'న్యాచురలెజా అర్బానా', 'కెమేలియన్' వంటి ప్రదర్శనలు కళా ప్రేమికుల కళ్లని విస్మయంలో పడేశాయి. ఒక్కో సిరీస్ ఒక్కో శైలిలో ఆమెను మరుగు పరుస్తుంది.

# ఊసర వల్లీ..!









# ఛాయ... మాయ



సూర్య గ్రహణం... అంతరిక్షం చేసే అద్భుతం. ఈ శతాబ్దంలోనే అత్యంత అద్భుతమైన సూర్య గ్రహణం ఆగస్ట్ 21న సంభవించింది. ఈ సెలస్టియల్ ఈవెంట్‌ను గ్రేట్ అమెరికా సోలార్ ఎక్లిప్స్‌గా పిలుస్తున్నారు. మొత్తం అమెరికాలో పట్ట పగలు నిశీధిని చల్లింది మరి. పసిఫిక్ తీరం నుంచి అట్లాంటిక్ తీరం వరకు యావత్ ఉత్తర అమెరికాలో పాకేసింది దీని ఛాయ. 1918 తర్వాత అలా జరగడం మొన్నే. అంటే వందేళ్ల సూపర్ ఎక్లిప్స్ కూడా ఇది. అక్కడేనా దక్షిణ అమెరికా, ఆఫ్రికా, యూరప్‌ల్లో కూడా చీకట్లను కుమ్మరించింది. ఈ సూర్య గ్రహణాన్ని బంధించేందుకు ఛాయాచిత్రకారులు ఓపిగ్గా ఎదురుచూశారు. వారి ఓపిక ఎంత అబ్బురమైన చిత్రాల్ని ప్రపంచానికి అందించిందో చూడండి.

## Check List

| Book Number | KNSR02B183 | Date | 3/09/22 |
|---|---|---|---|
| Front Cover | yes | Back Cover | yes |
| Blank Pages | NO | | |
| Missing Pages | NO | | |
| Prepared By | Lakshmi | Cutting By | Lakshmi |
| Scanned By | prathyu | Pages | 29 |